రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 55 | శుక్రవారం | 9.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 55 | Friday | 9.10.2026 | Pages: 8 | Rate: 2




ఢిల్లీలో పంజాబ్ ఆట!

6లో..

- కాంగ్రెస్‌లో మారిన కథ • రాహుల్ చెంత నేతల పరేడ్
- నిరసన వేదికగా నయా పాలిట్రిక్స్ • పీఠం కోసం కలిసికట్టుగా పోరాటం

ఢిల్లీలో రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన ఒక్కసారిగా రాజకీయ రణరంగంగా మారింది. ఎన్నికల సంఘంపై పోరాటం పేరుతో వీధుల్లోకి వచ్చిన కాంగ్రెస్ నేతల మధ్య ఎవరు ఎక్కడ నిలబడ్డారు? ఎవరు ఎవరికి దగ్గరగా కనిపించారు? ముఖ్యంగా, పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోల్పోయిన కొద్ది రోజులకే అమరీందర్ సింగ్ రాజా వారింగ్ రాహుల్ గాంధీ పక్కన ముందు వరుసలో ఎందుకు కనిపించారు? పోలీసుల అడ్డంకులను దాటుతూ చివరకు రాహుల్‌ను తీసుకెళ్తున్న పోలీసు బస్సుపైకి వారింగ్ ఎక్కడం వెనుక ఉన్న రాజకీయ సందేశం ఏమిటి? ఒకప్పుడు రాహుల్ గాంధీ టీమ్‌లో యువనేతగా ఎదిగిన వారింగ్.. ఇప్పుడు పదవి పోయినా గాంధీ కుటుంబానికి తన అనుబంధం చెక్కు చెదరలేదని చాటుకున్నారా? పంజాబ్‌లో ఆయన ప్రత్యర్థిగా నిలిచిన చరణ్‌జిత్ సింగ్ చన్నీ కూడా అదే నిరసనలో ఉండటం మరో ఆసక్తికర పరిణామం. ఇదే సమయంలో రాహుల్‌కు పాత అనుచరుడైన దీపేందర్ సింగ్ హుడా కూడా ముందువరుసలో కనిపించడం కాంగ్రెస్‌లో అసలు పవర్ సెంటర్ ఎక్కడుందన్న ప్రశ్నను లేవనెత్తుతోంది. పోలీసులతో ఘర్షణలు, తాజా ఎఫ్ఐఆర్‌లు, బీజేపీ తీవ్ర ఆరోపణలు ఈ కథను మరింత వేడెక్కించాయి. ఇది కేవలం ఎన్నికల సంఘంపై నిరసనా? లేక కాంగ్రెస్‌లో భవిష్యత్ నాయకత్వ సమీకరణాలకు తెరలేపుతున్న రాజకీయ సంకేతమా?



రాజ్‌ఘాట్ వేదికగా సీఈసీ రాజీనామాపై పోరు

ఇండియా కూటమి నేతల ప్రార్థనలు

ప్రత్యేక సమగ్ర సవరణపై కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి చేపట్టిన ఆందోళనలు మూడో రోజుకు చేరాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా సుమారు 300 మంది ప్రతిపక్ష ఎంపీలు రాజ్‌ఘాట్‌కు చేరుకుని మహాత్మా గాంధీ సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం అక్కడే శాంతియుతంగా కూర్చొని నిరసన తెలిపారు.

సీఈసీ రాజీనామా వరకు పోరాటం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని ఇండియా కూటమి నేతలు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా తమ నిరసనలను పోలీసులు అడ్డుకున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే పోలీసుల చర్యలు, నిరసనల నిర్వహణపై అధికార వర్గాల నుంచి భిన్నమైన వాదనలు ఉన్నాయి. (వివరాలు 2లో..)

జ్ఞానేశ్‌తో రాజీనామా చేయించండి



- సీఈసీ వ్యవహారం మీకే చుట్టుకుంటుంది
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ డిమాండ్

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో గురువారం సీఈసీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. (వివరాలు 2లో..)



భారత్ డిజిటల్ దూకుడు

టెక్నాలజీతో దిశ మార్పు

ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీలో జరుగుతున్న 10వ ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ దేశ టెలికాం రంగంలో వచ్చిన మార్పులను వివరించారు. కరోనా సమయంలోనూ టెలికాం వ్యవస్థను విస్తరించి మారుమూల గ్రామాలకు కనెక్టివిటీ అందించామని చెప్పారు. డిజిటల్ సదుపాయాల ద్వారా పల్లెప్రజలకు బ్యాంకింగ్, వైద్యం, ప్రభుత్వ సేవలు సులభంగా అందుతున్నాయని తెలిపారు. (వివరాలు 3లో..)



3లో..

రియల్ బాస్ అంబానీనా?

కేంద్రానికి మస్క్ సూటి ప్రశ్న

వంకర మాటలొద్దన్న కేంద్రం

స్టార్లింక్ అనుమతులపై రగడ

భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు అనుమతులు ఎందుకు ఆలస్యమవుతున్నాయన్న అంశం ఇప్పుడు పెద్ద వివాదంగా మారింది. స్పేస్‌ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ కేంద్ర ప్రభుత్వంపై మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. "భారత్‌కు అసలైన బాస్ అంబానీనా?" అంటూ రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని నేరుగా ప్రస్తావించారు. భారత్‌లో ఇంటర్నెట్ సదుపాయం లేని ప్రాంతాలకు స్టార్‌లింక్ ఎంతో ఉపయోగపడుతుందని మస్క్ చెప్పారు.



3లో..

వ్యాపారులకు భారీ ఊరట

అరెస్ట్ అధికారాలకు చెక్

ప్రాసిక్యూషన్ పరిమితి పెంపు

జీఎస్టీ భారీ సంస్కరణలు

వ్యాపార రంగానికి ఊరటనిచ్చేలా 57వ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో జీఎస్టీ ఆఫీసర్ల అరెస్ట్ అధికారాలను రద్దు చేయాలని నిర్ణయించింది. పన్ను నిబంధనల అమలులో వ్యాపారులపై ఒత్తిడి తగ్గించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యంగా సంస్కరణలు చేపట్టింది.



3లో..

భారత ఐటీకి అమెరికా దెబ్బ

గ్రీన్‌కార్డ్ ప్రోగ్రామ్ నుంచి దిగ్గజాలు ఔట్

భారత ఐటీ సంస్థలకు షాకిచ్చిన ట్రంప్

అమెరికాలో పనిచేస్తున్న భారతీయ ఐటీ నిపుణులకు కీలకంగా మారిన గ్రీన్‌కార్డ్ ప్రక్రియపై ట్రంప్ ప్రభుత్వం మరో కఠిన నిర్ణయం తీసుకుంది. కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్‌జెమినీ వంటి ప్రముఖ సంస్థలను పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ నుంచి సస్పెండ్ చేసింది.



2లో..

ఎన్నికల కమిషన్ రద్దుకు సుప్రీంలో పిటిషన్

నియామకాలను రద్దు చేయాలంటూ సవాల్

దేశవ్యాప్తంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై నిరసనలు కొనసాగుతున్నవేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.



2లో..

సీఈసీకి 42 మంది మాజీ జడ్జిలు మద్దతు

రాజ్యాంగ సంస్థలు ఎవరి సొత్తు కాదు

విశ్వసనీయత దెబ్బతీసే ప్రయత్నాలొద్దు

దేశంలోని రాజ్యాంగ సంస్థలపై, ముఖ్యంగా ఎన్నికల సంఘం, ఉన్నత న్యాయవ్యవస్థపై ఆధారాలు లేకుండా విమర్శలు చేయడం ప్రమాదకరమని 42 మంది మాజీ న్యాయమూర్తులు, పదవీ విరమణ చేసిన అధికారులు హెచ్చరించారు.


సీజేపీ ప్రొటెస్ట్‌కు ముందు ఢిల్లీ పోలీసుల నిఘా



2లో..

- 500 మంది గుర్తింపు.. 200 సోషల్ చానళ్లపై కన్ను
- ఆన్‌లైన్ ప్రచారంపై ఫోకస్ పెట్టిన యంత్రాంగం

అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద జరగనున్న నిరసనకు ముందు ఢిల్లీ పోలీసులు సోషల్ మీడియా వ్యూహాన్ని మరింత ముమ్మరం చేశారు.



7లో..

డాలర్@100

దేశ ఆర్థిక వ్యవస్థ ఏమైపోతుందో?

రూపాయి పతనం.. మార్కెట్ల కుదుపు

ఆర్థిక ఒత్తిడికి ఇదే సంకేతమా?

మార్కెట్లలో ఒక్కరోజే భారీ ప్రకంపనలు

ఎందుకు? ఏమిటి? ఎలా?

దేశ ఆర్థిక వ్యవస్థను ఇప్పుడు ఒకేసారి ఎన్నో తుఫాన్లు చుట్టుముడుతున్నాయా? రూపాయి 96.88 వద్దకు జారింది.. సెంచరీ కొడతానంటూ దూసుకుపోతోంది. ముడిచమురు ధర 104 డాలర్లకు చేరింది.. సెన్సెక్స్ ఏకంగా 1,045 పాయింట్లు పతనమైంది.. ఒక్క రోజులోనే రూ. 10 లక్షల కోట్ల మార్కెట్ సంపద ఆవిరైంది! ఇంతటి ఒత్తిడి ఎందుకు వచ్చింది? కేవలం అంతర్జాతీయ పరిణామాలే కారణమా? లేక ఆర్బీఐ తీసుకున్న కీలక నిర్ణయం మార్కెట్లను మరింత భయపెట్టిందా? 6.5 శాతం నుంచి 5.25 శాతానికి తగ్గించిన రెపో రేటును మళ్లీ 5.50 శాతానికి పెంచడం వెనుక అసలు లెక్క ఏమిటి? ఈ నిర్ణయం సాధారణ కుటుంబం చెల్లించే హోమ్ లోన్ ఈఎంఐపై ఎంత భారం పెంచుతుంది? కొత్తగా ఇల్లు కొనేవారి రుణ అర్హత ఎందుకు తగ్గొచ్చు? కార్లు కొనేవారు, చిన్న వ్యాపారాలు, ఎంఎస్ఎంఈలు ఎదుర్కొనే కొత్త సవాళ్లు ఏమిటి? మరోవైపు పశ్చిమాసియా ఉద్రిక్తతలు చమురు ధరలను మరింత పెంచితే రూపాయి 100కు చేరువైతే పరిస్థితి ఎలా మారుతుంది? మార్కెట్ ఇప్పటికే కీలక మద్దతు స్థాయిలను కోల్పోయింది. ఇది తాత్కాలిక కుదుపేనా? లేక మరో పెద్ద ఆర్థిక పతనానికి ముందస్తు హెచ్చరికా? అసలు ఏం జరుగుతోంది.. ఎందుకు జరుగుతోంది.. ఇక ముందు ఏం జరగబోతోంది?



జూరాల కాలువకు నీళ్లు వదిలిన రైతులపై కేసు

14 మంది అన్నదాతలపై ఎఫ్ఐఆర్ నమోదు

వనపర్తి జిల్లాలో జూరాల ప్రాజెక్టు కాలువకు బలవంతంగా నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా అధికారులు స్పందించకపోవడంతో రైతులు సెప్టెంబర్ 19న జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. (వివరాలు 2లో..)

రైతుల చేతులకు బేడీలా?

రైతులపై కేసులు పెట్టడం హేయం

ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడన

కేసులు ఉపసంహరించుకోవాలన్న హరీశ్ రావు



జూరాల ఎడమ కాలువకు నీరు విడుదల చేయాలంటూ ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేయడం తెలంగాణలో రాజకీయ దుమారం రేపుతోంది. రైతులపై కేసుల వ్యవహారంపై బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే సాగునీటి కోసం ప్రశ్నించిన రైతులపై కేసులు పెట్టడం (వివరాలు 2లో..)



92 లక్షల ఓట్ల తొలగింపు కుట్ర

- బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ
- లోక్‌భవన్ ముట్టడించిన కాంగ్రెస్
- సీఈసీ రాజీనామాకు నేతల డిమాండ్
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణలు

ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయంటూ తెలంగాణ కాంగ్రెస్ చేపట్టిన చలో లోక్‌భవన్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ప్రదర్శన లోక్‌భవన్ వైపు సాగింది. పందలాది మంది ముట్టడికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. (వివరాలు 2లో..)



3లో..

ఆటిజంపై సమాజం ఆలోచన మారాలి

అవగాహనే.. మార్పునకు తొలి అడుగు

సుమన్ సరాఫ్‌కు గవర్నర్ ప్రశంసలు



2లో..

విజయ్ ఎఫెక్ట్‌తో కొత్త లెక్కలు

రాజ్యసభ రేసులో రజనీ భార్య

లతా ఢిల్లీ మకాం.. టికెట్‌పై చర్చ



జూరాల నీళ్లు వదిలిన రైతులపై కేసు

14 మంది అన్నదాతలపై ఎఫ్ఐఆర్ నమోదు

వనపర్తి జిల్లాలో జూరాల ప్రాజెక్టు కాలువకు బలవంతంగా నీటిని విడుదల చేసిన 14 మంది రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా అధికారులు స్పందించకపోవడంతో రైతులు సెప్టెంబర్ 19న జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. తమ పొలాలకు నీరు అందించాలనే ఉద్దేశంతో గేట్లు ఎత్తి కాలువలోకి నీటిని విడుదల చేసుకున్నారు. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో జరిగిన ఈ ఘటనపై సాగునీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ఆధారంగానే కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై స్వాతి తెలిపారు. రైతులు ముందుగా అధికారులను కలిసి నీరు విడుదల చేయాలని కోరినా స్పందన లేకపోవడంతో ఈ చర్యకు దిగారు.

ధర్నా చేసిన నేతలపైనా కేసులు

జూరాల నుంచి సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు గత కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయన్న ఆవేదనతో రైతులు గేట్లు ఎత్తినట్లు స్థానికంగా వెల్లడైంది. ఇదే సమయంలో నీటి విడుదల కోసం నిరసన చేపట్టిన రాజకీయ నాయకులపైనా కేసులు నమోదయ్యాయి. సెప్టెంబర్ 21న జమ్మిచేడు వద్ద జూరాల ప్రాజెక్టు నుంచి వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. దీంతో జూరాల సాగునీటి అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. రైతుల సాగునీటి అవసరాలు, అధికారుల చర్యలు, నిరసనలపై ఇప్పుడు స్థానికంగా రాజకీయ చర్చ కొనసాగుతోంది.

రైతుల చేతులకు బేడీలా?

- రైతులపై కేసులు పెట్టడం హేయం
- ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడన
- కేసులు ఉపసంహరించుకోవాలన్న హరీశ్ రావు



జూరాల ఎడమ కాలువకు నీరు విడుదల చేయాలంటూ ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేయడం తెలంగాణలో రాజకీయ దుమారం రేపుతోంది. రైతులపై కేసుల వ్యవహారంపై బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే సాగునీటి కోసం ప్రశ్నించిన రైతులపై కేసులు పెట్టడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా అంటూ ప్రశ్నించారు. కృష్ణా నదిలో నీటి ప్రవాహాలు ఉన్న సమయంలో నీటిని సద్వినియోగం చేసుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రైతులపై కేసులు పెట్టడం ప్రజా పాలన కాదని, ప్రజా పీడన పాలనలా ఉందని వ్యాఖ్యానించారు. నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పార్టీల నేతలపైనా కేసులు

జూరాల నుంచి నీటిని విడుదల చేయాలని సెప్టెంబర్ 21న నిరసన చేపట్టిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులపైనా పోలీసులు కేసులు నమోదు చేశారు. జమ్మిచేడు వద్ద జరిగిన ధర్నాకు సంబంధించి కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై కేసులు పెట్టడం సరికాదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి కూడా రైతులపై కేసులను ఖండించారు. కృష్ణా జలాలను సద్వినియోగం చేయకపోవడం వల్లే రైతులు రోడ్డెక్కాల్సి వచ్చిందని ఆరోపించారు. పంటలను కాపాడుకునేందుకు ఆందోళన చేసిన అన్నదాతలపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

కేసుల ఉపసంహరణకు డిమాండ్

జూరాల సాగునీటి సమస్యపై రైతులు, ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. సాగునీరు, విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో సమస్యకు పరిష్కారం చూపకుండా పోలీసు కేసులతో అణచివేయడం సరికాదని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. రైతులపై నమోదైన కేసులు వెంటనే ఎత్తివేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హరీశ్‌రావు హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల తరపున పోరాటం కొనసాగిస్తామని లక్ష్మారెడ్డి కూడా స్పష్టం చేశారు. దీంతో జూరాల నీటి వివాదం ఇప్పుడు సాగునీటి సమస్యతో పాటు రాజకీయ పోరాటంగా మారింది.

జ్ఞానేశ్‌తో రాజీనామా చేయించండి

- సీఈసీ వ్యూహారం మీకే చుట్టుకుంటుంది
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ డిమాండ్

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో గురువారం సీఈసీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ 'సర్'ను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని, ఓట్ల తొలగింపు కాంగ్రెస్‌కు సంబంధించిన సమస్య కాదని, దేశ ప్రజల హక్కులకు సంబంధించిన అంశమని రేవంత్ స్పష్టం చేశారు.

మోదీకి తీవ్ర హెచ్చరిక

సర్ ప్రక్రియను రద్దు చేయకపోతే ప్రధాని నరేంద్ర మోదీ పదవి నుంచి తప్పుకోవాల్సి వస్తుందని రేవంత్ హెచ్చరించారు. ప్రధాని మోదీ మొండివైఖరి వీడి వెంటనే స్పందించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే ప్రధాని అధికారంలోంచి దించడానికి దారితీస్తోందని హెచ్చరించారు. మతం, భాషను ఉపయోగించి ఎన్నికల్లో గెలిచే ప్రయత్నాలు జరిగాయని, తరువాత ఈడీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగించారని ఆరోపించారు. ఇప్పుడు ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో భారీగా ఓట్లను తొలగించి మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని విమర్శించారు.

ఓట్ల తొలగింపుపై ఆరోపణలు

ఎన్నికల ప్రక్రియలో అక్రమంగా ఓట్ల తొలగింపు జరిగితే సమాజంలో రెండు రకాల పౌరులు ఏర్పడే ప్రమాదం ఉందని రేవంత్ అన్నారు. ఓటు ఉన్నవారు, ఓటు లేనివారిగా పౌరులను విభజించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బ్రిటిష్ పాలనలో సైమన్ కమిషన్‌ను ఉపయోగించినట్లే, బీజేపీ ఎన్నికల కమిషన్‌ను ఉపయోగిస్తోందని విమర్శించారు. నాడు భగత్ సింగ్ పోరాడితే, ఇప్పుడు రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్నారని చెప్పారు. బలహీన వర్గాల ఓటు హక్కును కాపాడటమే రాహుల్ లక్ష్యమన్నారు.

మూడు రోజులుగా విపక్ష పోరు

ఇండియా కూటమి నేతలు వరుసగా మూడో రోజు నిరసనలు కొనసాగించారు. మంగళవారం పార్లమెంట్ నుంచి ఎన్నికల సదన్ వరకు మార్చ్ నిర్వహించారు. బుధవారం జంతర్ మంతర్ వద్ద నిరసనకు ప్రయత్నించగా పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ వాద్రా సహా విపక్ష నేతలు రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. ప్రజాస్వామ్యం, నిరసన హక్కు, ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు.





92 లక్షల ఓట్ల తొలగింపు కుట్ర

- బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ
- లోక్‌భవన్ ముట్టడించిన కాంగ్రెస్
- సీఈసీ రాజీనామాకు నేతల డిమాండ్
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణలు

ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయంటూ తెలంగాణ కాంగ్రెస్ చేపట్టిన చలో లోక్‌భవన్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ప్రదర్శన లోక్‌భవన్ వైపు సాగింది. వందలాది మంది ముట్టడికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఓట్ల తొలగింపుపై ఆరోపణలు

అరెస్టు అనంతరం కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు చేశారు. బిహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత తెలంగాణను కూడా బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్‌తో బీజేపీ కుమ్మక్కై 92 లక్షల ఓట్లను తొలగించిందని ఆయన ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఆయనను పదవి నుంచి తొలగించే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ఓటర్ల జాబితా సవరణపై ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయని అన్నారు. పారదర్శక ఎన్నికల వ్యవస్థ కోసం తమ పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ తేల్చిచెప్పింది. ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష నేతల అరెస్టులను కూడా కాంగ్రెస్ నేతలు ఖండించారు. రాజ్‌భవన్, లోక్‌భవన్ పరిసరాల్లో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు.

సీఈసీకి 42 మంది మాజీ జడ్జీలు మద్దతు

- రాజ్యాంగ సంస్థలు ఎవరి సొత్తు కాదు
- విశ్వసనీయత దెబ్బతీసే ప్రయత్నాలొద్దు

దేశంలోని రాజ్యాంగ సంస్థలపై, ముఖ్యంగా ఎన్నికల సంఘం, ఉన్నత న్యాయవ్యవస్థపై ఆధారాలు లేకుండా విమర్శలు చేయడం ప్రమాదకరమని 42 మంది మాజీ న్యాయమూర్తులు, పదవీ విరమణ చేసిన అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు దేశ పౌరులను ఉద్దేశించి వారు బహిరంగ లేఖ విడుదల చేశారు. రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ వేదికలపై ఎన్నికల సంఘం, న్యాయస్థానాలపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

ఓటర్ల జాబితాల సవరణపై వివరణ

ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలను విశ్వసించే పార్టీలు ఓడినప్పుడు వాటి విశ్వసనీయతను ప్రశ్నించడం సమంజసం కాదని మాజీ న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణకు చట్టపరమైన ఆధారం ఉందని తెలిపారు. మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, అనర్హుల పేర్లను తొలగించడం.. అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం ఎన్నికల జాబితాలను ఖచ్చితంగా ఉంచేందుకు అవసరమైన ప్రక్రియ అని వివరించారు. దీనిని కుట్రగా చిత్రీకరించడం ప్రజల్లో అనవసర అనుమానాలు, గందరగోళానికి దారితీస్తుందని హెచ్చరించారు.

ఆధారాలతోనే ఆరోపణలు చేయాలి

ఎన్నికల సమయంలో ఓట్ల దొంగతనం జరిగిందని ఆరోపించే రాజకీయ పార్టీలు, ఆ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను కోర్టుల్లో సమర్పించాలని వారు సూచించారు. ఫిర్యాదులు ఉంటే ఎన్నికల సంఘం లేదా న్యాయస్థానాలను ఆశ్రయించాలని కోరారు. మీడియా సంస్థలు కూడా ఆధారాలు లేని ఆరోపణలు, పుకార్లను వార్తలుగా ప్రచారం చేయకూడదని సూచించారు. రాజ్యాంగ సంస్థలు పారదర్శకంగా, రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా పనిచేయాలని పేర్కొన్నారు. పౌరులు కూడా రాజకీయ వాదనలను గుడ్డిగా నమ్మకుండా వాస్తవాలను పరిశీలించాలని పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్యంపై విశ్వాసమే కీలకం

రాజ్యాంగ సంస్థలు ఏ ఒక్క ప్రభుత్వం, రాజకీయ పార్టీకి చెందినవి కావని, అవి దేశ ప్రజలందరికీ చెందినవని 42 మంది మాజీ న్యాయమూర్తులు స్పష్టం చేశారు. వాటి ప్రతిష్ట దెబ్బతింటే ప్రజల్లో అవిశ్వాసం పెరిగి సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ పరిస్థితిని దేశ వ్యతిరేక శక్తులు తమ ప్రయోజనాలకు ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. అందుకే ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కాపాడటం అందరి బాధ్యత అని స్పష్టం చేస్తూ, ప్రజల ఓటు శక్తిపై విశ్వాసాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు.





విజయ్ ఎఫెక్ట్‌తో కొత్త లెక్కలు

- రాజ్యసభ రేసులో రజనీ భార్య
- లతా ధిల్లీ మకాం.. టికెట్‌పై చర్చ

తమిళ రాజకీయాల్లో సినీ తారల ప్రభావం కొత్త మలుపు తిరుగుతోందా? హీరో విజయ్ రాజకీయ అరంగేట్రంతో ఏర్పడిన కొత్త ఆసక్తి మధ్య రజనీకాంత్ కుటుంబం కూడా రాజకీయ వేదికపైకి రావాలనుకుంటోందన్న ప్రచారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రాజకీయాల్లోకి ఎవరు వస్తారు, ఎవరు ఎక్కడి నుంచి వస్తారు అన్నది ఇంతకాలం అభిమానుల చర్చగా ఉండేది. ఇప్పుడు ఏకంగా రాజ్యసభ సీటు వరకూ చర్చ రావడం ఆసక్తికరంగా మారింది. విజయ్ రాజకీయ ప్రభావం పెరుగుతుందన్న అంచనాల నేపథ్యంలో లతా రజనీకాంత్ ధిల్లీలో మకాం వేయడం ఈ ఊహాగానాలకు మరింత ఊపునిచ్చింది. సినిమా స్క్రీన్‌పై హీరోలు మారుతుంటే.. రాజకీయ స్క్రీన్‌పై రాజ్యసభ కుర్చీ కోసం కొత్త పాత్రలు సిద్ధమవుతున్నాయన్నట్టుగా పరిస్థితి మారింది.

లతా లాబీయింగ్.. రజనీకి టికెట్?

లతా రజనీకాంత్ తనకు లేదా భర్త రజనీకాంత్‌కు రాజ్యసభ అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. కమల్ హాసన్‌కు డీఎంకే మద్దతుతో రాజ్యసభ అవకాశం దక్కిన నేపథ్యంలో రజనీకి కూడా పార్లమెంటరీ పాత్ర ఉండాలన్న ఆలోచన ఉన్నట్లు సమాచారం. ఢిల్లీలో ఉన్న లతా పలువురు కేంద్ర మంత్రులను కలిసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రహ్లాద్ జోషి, రాజ్‌నాథ్ సింగ్ వంటి నేతలతో భేటీలు జరిగినట్లు కథనాలు వచ్చాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలవాలని కూడా ఆమె ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇంతలో మాజీ అల్లుడు ధనుష్ సైతం రాజకీయ పార్టీ పెట్టే ఆలోచనలో ఉన్నారన్న ప్రచారం మరోవైపు నడుస్తోంది. అంటే తమిళనాడులో సినిమా కుటుంబాల నుంచి రాజకీయ పార్టీలు, రాజ్యసభ సీట్లు.. అన్నీ ఒకేసారి లైన్లోకి వస్తున్నాయన్నమాట!

చిన్న చిక్కులు.. పెద్ద ఆశలు

అయితే లతా ప్రయత్నాలకు కొన్ని న్యాయపరమైన అంశాలు అడ్డంకిగా మారే అవకాశం ఉందన్న ప్రచారం కూడా ఉంది. ముఖ్యంగా మున్సిపల్ బకాయిలకు సంబంధించిన చిన్నచిన్న సమస్యలు ఉన్నట్లు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అవి పరిష్కరించుకునే అవకాశమూ ఉందని సమాచారం. ఇక తమిళ రాజకీయాల్లో 'సూపర్‌స్టార్' అనే బిరుదు ఒక్కటే సరిపోదేమో.. రాజ్యసభలో సీటు కోసం ధిల్లీలో లాబీయింగ్ కూడా అవసరమే అన్న సెటైర్ వినిపిస్తోంది. విజయ్ రాజకీయ ఎంట్రీతో తమిళనాడు రాజకీయాల్లో సినిమా తారల కొత్త ఇన్నింగ్స్ మొదలవుతుందనుకుంటే, ఇప్పుడు రజనీ కుటుంబం చుట్టూ రాజ్యసభ చర్చ మొదలవడం మరింత ఆసక్తి రేపుతోంది.

ఎన్నికల కమిషన్ రద్దుకు సుప్రీంలో పిటిషన్

నియామకాలను రద్దు చేయాలంటూ సవాల్



దేశవ్యాప్తంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై నిరసనలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి తీసుకొచ్చిన 2023 చట్టాన్ని కూడా పిటిషనర్ సవాలు చేశారు. ముఖ్యంగా ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించడాన్ని ప్రశ్నించారు. ఎన్నికల నియామక ప్రక్రియలో పారదర్శకత, స్వతంత్రతకు భంగం కలిగే అవకాశం ఉందని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఎస్ఐఆర్ రద్దుకు ఉద్యమాలు

మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన నిరసనలో నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే తమ లక్ష్యం కాదని, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా సమస్య పరిష్కారం కాదని నిరసనకారులు పేర్కొన్నారు. వివాదాస్పద ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి ఎన్నికల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10 నుంచి సీజేపీ, వివిధ విద్యార్థి సంఘాలు సుదీర్ఘ ఆందోళనలకు పిలుపునిచ్చాయి. దీంతో ఢిల్లీ అధికారులు అప్రమత్తమై భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతున్నారు.

సీజేపీ ప్రొటెస్ట్‌కు ముందు ఢిల్లీ పోలీసుల నిఘా

- 500 మంది గుర్తింపు.. 200 సోషల్ చానళ్లపై కన్ను
- ఆన్‌లైన్ ప్రచారంపై ఫోకస్ పెట్టిన యంత్రాంగం

అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద జరగనున్న నిరసనకు ముందు ఢిల్లీ పోలీసులు సోషల్ మీడియా వ్యూహాన్ని మరింత ముమ్మరం చేశారు. జూలైలో జరిగిన నిరసన సమయంలో పోలీసుల కంటే ఆందోళనకారుల వాదన సోషల్ మీడియాలో ఎక్కువగా ప్రచారం పొందిందని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఈసారి పోలీసుల వాదనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా ప్రత్యేక 'పర్సెప్షన్ మేనేజ్‌మెంట్' ప్రచారాన్ని చేపట్టారు. గత అనుభవాల ఆధారంగా సోషల్ మీడియాలో తమ కంటెంట్‌కు ఎక్కువ స్పందన వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

500 మందిపై ప్రత్యేక నజర్

అక్టోబర్ 10 నిరసనకు హాజరయ్యే అవకాశం ఉందని భావిస్తున్న కనీసం 500 మందిని ఢిల్లీ పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఇందులో నిరసన నిర్వాహకులు, వారి ప్రధాన బృంద సభ్యులు, మద్దతుదారులతో పాటు డ్రైవర్లు, ఇంటి పనివారు ఇతర సిబ్బంది కూడా ఉన్నట్లు తెలుస్తోంది. నిరసనకు ప్రజలను సమీకరించేందుకు ఉపయోగిస్తున్నట్లు భావిస్తున్న దాదాపు 200 వాట్సాప్, టెలిగ్రామ్ చానళ్లను కూడా పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తూ నిరసనకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నారు.

పోలీసుల వీడియోలతో కొత్త వ్యూహం

జూలై నిరసన సమయంలో పోలీసులపై ప్రతికూల కథనం బలంగా వ్యాప్తి చెందిందని అధికారులు చెబుతున్నారు. దీనికి ప్రతిగా ప్రస్తుతం పోలీసుల అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వరుస వీడియోలను విడుదల చేస్తున్నారు. నిరసనల్లో గాయపడిన సిబ్బంది, చిరిగిన యూనిఫామ్‌లు, బ్యాడ్జీలు, కుప్పకూలిన మహిళా పోలీసులు, నిరసనకారులు పోలీసులను అడ్డుకున్నట్లు చూపించే దృశ్యాలను ప్రచారం చేస్తున్నారు. పోలీసుల వెర్షన్ ప్రజల్లోకి వెళ్లేలా వీడియోలు, సీనియర్ అధికారుల వివరణలను విస్తృతంగా ప్రచారం చేయడం ఈ వ్యూహంలో ప్రధాన భాగంగా మారింది.



జర్నలిస్టులపైనా పర్యవేక్షణ

పోలీసుల నిఘా నిరసనకారులతో మాత్రమే ఆగలేదు. తమను 'స్వతంత్ర జర్నలిస్టులు'గా పేర్కొంటున్న సుమారు 100 మందిని, వారికి సంబంధించిన 20 చానళ్లను కూడా పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో తమ కంటెంట్‌కు తగిన స్థాయిలో స్పందన రాకపోవడానికి కారణాలపై మెటా, ఎక్స్ ఇతర సోషల్ మీడియా సంస్థలతో పోలీసులు పరిశీలన జరుపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం నిరసనకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రచారాన్ని గమనిస్తూ, అదే ఘటనలపై పోలీసుల వివరణను వెంటనే విడుదల చేస్తున్నారు. అక్టోబర్ 10 నిరసనకు ముందు ఢిల్లీ పోలీసుల ఆన్‌లైన్ నిఘా, ప్రచార వ్యూహం మరింత కీలకంగా మారింది.



ఇండియా రియల్ బాస్
అంబానీనా?

- కేంద్రానికి మస్క్ సూటి ప్రశ్న
- వంకర మాటలొద్దన్న కేంద్రం
- స్టార్లింక్ అనుమతులపై రగడ

భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు అనుమతులు ఎందుకు ఆలస్యమవుతున్నాయన్న అంశం ఇప్పుడు పెద్ద వివాదంగా మారింది. స్పేస్‌ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ కేంద్ర ప్రభుత్వంపై మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. "భారత్‌కు అసలైన బాస్ అంబానీనా?" అంటూ రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని నేరుగా ప్రస్తావించారు. భారత్‌లో ఇంటర్నెట్ సదుపాయం లేని ప్రాంతాలకు స్టార్‌లింక్ ఎంతో ఉపయోగపడుతుందని మస్క్ చెప్పారు. 165కిపైగా దేశాల్లో స్టార్‌లింక్‌కు అనుమతులు ఉన్నాయని, భారత్‌లో మాత్రం ఐదేళ్లుగా ప్రభుత్వ నిబంధనలను పాటిస్తున్నా లైసెన్స్ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.

కేంద్రం ఘాటైన సమాధానం

మస్క్ ఆరోపణలను కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ పూర్తిగా ఖండించింది. భారత్ ఉపగ్రహ కమ్యూనికేషన్ రంగంలో నిబంధనలు అన్ని సంస్థలకు ఒకే విధంగా వర్తిస్తున్నాయని స్పష్టం చేసింది. స్టార్‌లింక్‌తో పాటు ఇతర సంస్థలు కూడా భద్రతా ప్రమాణాలను పూర్తి చేయాల్సి ఉందని తెలిపింది. భారత వినియోగదారుల డేటా భద్రత, దేశ భద్రతను దృష్టిలో పెట్టుకునే అనుమతుల ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది. నిబంధనల్లో వివక్ష చూపుతున్నారన్న ఆరోపణలు "నిరాధారమైనవి, తప్పుదారి పట్టించేవి" అని కేంద్రం స్పష్టం చేసింది.

స్టార్‌లింక్‌కు ఇంకా ఎదురుచూపులే

భారత్‌లో సేవలు ప్రారంభించేందుకు స్టార్‌లింక్ ఇప్పటికే 20 డేటా సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధి లారెన్ డ్రేయర్ తెలిపారు. వచ్చే ఏడాది ఇదే సమయానికి అనుమతి వస్తుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు భారత్‌లో ఇప్పటికే భారతి మద్దతున్న వన్‌వెబ్, రిలయన్స్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ విభాగానికి అనుమతులు లభించాయి. అయితే వీటికి కూడా భద్రతా పరిశీలనలు కొనసాగుతున్నాయని కేంద్రం స్పష్టం చేసింది. దీంతో అనుమతుల ఆలస్యంపై మస్క్ చేసిన ఆరోపణలకు కేంద్రం వివరణ ఇచ్చినట్టయింది.

రాజకీయ రంగంలోకి రాహుల్

మస్క్ వ్యాఖ్యలపై రిలయన్స్ జియో చైర్మన్ ఆకాష్ అంబానీ స్పందించేందుకు నిరాకరించారు. ఇదే సమయంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చర్చలోకి వచ్చారు. "వెల్‌కమ్ టు ఇండియా ఎలన్.. మరో వ్యక్తి గురించి తెలుసుకునే వరకు వేచి ఉండండి" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. దీనికి మస్క్ స్పందిస్తూ "ఇది నిజంగా ఆందోళన కలిగించే విషయం" అన్నారు. దీంతో స్టార్‌లింక్ అనుమతుల వివాదం కేవలం వ్యాపార అంశంగా కాకుండా, కేంద్రం, అంబానీ, మస్క్, విపక్షాల మధ్య రాజకీయ చర్చకు దారితీసింది.



భారత ఐటీకి
అమెరికా దెబ్బ

- గ్రీన్‌కార్డ్ ప్రోగ్రామ్ నుంచి దిగ్గజాల ఔట్
- భారత ఐటీ సంస్థలకు షాకిచ్చిన ట్రంప్

అమెరికాలో పనిచేస్తున్న భారతీయ ఐటీ నిపుణులకు కీలకంగా మారిన గ్రీన్‌కార్డ్ ప్రక్రియపై ట్రంప్ ప్రభుత్వం మరో కఠిన నిర్ణయం తీసుకుంది. కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్‌సీఎల్, క్యాప్‌జెమినీ వంటి ప్రముఖ సంస్థలను పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ నుంచి సస్పెండ్ చేసింది. అమెరికా కార్మిక శాఖ మంత్రి కీత్ సోండర్లింగ్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా కంపెనీలు హెచ్ 1బీ వీసాలపై పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులకు శాశ్వత ఉద్యోగం, గ్రీన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసే అవకాశం ఉంటుంది.

అమెరికన్ల ఉద్యోగాలపై వాదన

ఈ సంస్థలు విదేశీ ఉద్యోగులను భారీగా నియమించడం వల్ల అమెరికన్ల ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని అమెరికా ప్రభుత్వం ఆరోపించింది. 2009 నుంచి సస్పెండ్ చేసిన సంస్థలు దాదాపు 30 లక్షల విదేశీ ఉద్యోగులను కోరాయని, 2.30 లక్షలకు పైగా హెచ్ 1బీ అనుమతులు పొందాయని సోండర్లింగ్ తెలిపారు. లక్షకు పైగా పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్లు కూడా పొందినట్లు చెప్పారు. కొత్త దరఖాస్తులను స్వీకరించకపోవడంతో పాటు, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రక్రియను కూడా నిలిపివేయనున్నట్లు స్పష్టం చేశారు.

వాన్స్ తీవ్ర విమర్శలు

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఐటీ కంపెనీలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ముఖ్యంగా మైక్రోసాఫ్ట్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, 6 వేల మంది అమెరికా ఉద్యోగులను తొలగించిన తర్వాత అదే సంస్థ వేలాది హెచ్ 1బీ దరఖాస్తులు చేసిందని ఆరోపించారు. హెచ్ 1బీ ఉద్యోగులను "విదేశీ ఒప్పంద కార్మికులు"గా అభివర్ణించిన వాన్స్, ఈ విధానాన్ని ఉపయోగించే కంపెనీలను "వీసా మిల్లులు"గా విమర్శించారు. అమెరికా ఉద్యోగుల వేతనాలను తగ్గించేందుకు వీసా విధానాలను దుర్వినియోగం చేయడాన్ని అనుమతించబోమని స్పష్టం చేశారు.

భారత నిపుణులపై ప్రభావం

ప్రతి ఏడాది అమెరికా ఆమోదించే హెచ్ 1బీ వీసాల్లో భారతీయ ఐటీ నిపుణుల వాటా గణనీయంగా ఉంటుంది. దీంతో తాజా నిర్ణయం భారత ఐటీ కంపెనీలు, అమెరికాలో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే హెచ్ 1బీ వీసాపై 1 లక్ష డాలర్ల ఫీజు విధించే నిర్ణయాన్ని ట్రంప్ ప్రభుత్వం మరో ఏడాదికి పొడిగించింది. ఇప్పుడు గ్రీన్‌కార్డ్‌కు దారితీసే పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రక్రియపై ఆంక్షలు విధించడంతో అమెరికాలో భారతీయ టెక్ ఉద్యోగుల భవిష్యత్తుపై కొత్త ఆందోళనలు మొదలయ్యాయి.

రాజ్‌ఘాట్ వేదికగా సీఈసీ రాజీనామాపై పోరు

- ఇండియా కూటమి నేతల ప్రార్థనలు

ప్రత్యేక సమగ్ర సవరణపై కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి చేపట్టిన ఆందోళనలు మూడో రోజుకు చేరాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా సుమారు 300 మంది ప్రతిపక్ష ఎంపీలు రాజ్‌ఘాట్‌కు చేరుకుని మహాత్మా గాంధీ సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం అక్కడే శాంతియుతంగా కూర్చొని నిరసన తెలిపారు.



సీఈసీ రాజీనామా వరకు పోరాటం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని ఇండియా కూటమి నేతలు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా తమ నిరసనలను పోలీసులు అడ్డుకున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే పోలీసుల చర్యలు, నిరసనల నిర్వహణపై అధికార వర్గాల నుంచి భిన్నమైన వాదనలు ఉన్నాయి.

మోదీ, షాలకు సద్బుద్ధి రావాలి

రాజ్‌ఘాట్ వద్ద జరిగిన కార్యక్రమాన్ని 'సత్యాగ్రహం' తరహాలో నిర్వహించిన ప్రతిపక్ష నేతలు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు సద్బుద్ధి కలగాలని ప్రార్థించారు. ఖర్గే మాట్లాడుతూ ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి నేతలు సాధించిన ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

'ఓటు చోరీ'పై రాహుల్ ఆరోపణలు

రాహుల్ గాంధీ ఎన్నికల వ్యవస్థపై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాని మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి దేశాన్ని 'హైజాక్' చేయడానికి, ఓట్లను 'దొంగిలించడానికి' కుట్ర చేశారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలను బీజేపీ, ఎన్నికల సంఘం తిరస్కరిస్తున్నాయి. ఓటర్ల జాబితా సవరణ ఉద్దేశం అర్హత లేని, డూప్లికేట్, మృతుల పేర్లను గుర్తించి జాబితాను శుద్ధి చేయడమేనని అధికార వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రపతిని కలవనున్న ప్రతిపక్ష నేతలు

ఎన్నికల సంఘంపై తమ అభ్యంతరాలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతిపక్ష నేతలు ప్రయత్నిస్తున్నారు. సర్ ప్రక్రియపై తమ ఆరోపణలు, అభ్యంతరాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించాలని నిర్ణయించారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా సవరణపై నిరసనలు కొనసాగుతున్నాయి. సీఈసీ రాజీనామా, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై ప్రతిపక్షాల డిమాండ్లు రానున్న రోజుల్లోనూ కొనసాగనున్నట్లు నేతలు ప్రకటించారు.

ఆటిజంపై సమాజం ఆలోచన మారాలి

- అవగాహనే.. మార్పునకు తొలి అడుగు
- సుమన్ సరాఫ్‌కు గవర్నర్ ప్రశంసలు

ఆటిజం ఉన్న పిల్లలను జాలితో కాదు.. అర్థం చేసుకునే మనసుతో చూడాలి. ప్రతి బిడ్డలోనూ ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని గుర్తించి సరైన దిశలో ప్రోత్సహిస్తే అద్భుతమైన ఫలితాలు సాధ్యమవుతాయని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా స్పష్టం చేశారు. ఆటిజం ఒక వ్యాధి కాదని, పిల్లల న్యూరో డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రత్యేక స్థితి అని సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబం, సమాజం, నిపుణుల సహకారంతో పిల్లలకు శిక్షణ అందిస్తే వారి భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని పేర్కొన్నారు. ఈ దిశగా మాధవ్ ఆటిజమ్ ఫౌండేషన్ చేస్తున్న దశాబ్ద కాలపు సేవలు, 14 వేల మంది పిల్లలకు అందించిన సహాయం ప్రత్యేక ప్రశంసలకు పాత్రమయ్యాయి.

ఆటిజంపై అవగాహన పెంచేందుకు గత పదేళ్లుగా సుమన్ సరాఫ్ చేస్తున్న కృషిని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రశంసించారు. ఆమె సేవలకు అభినందనలు చెప్పడం కంటే, ఈ రంగంలో కొనసాగిస్తున్న సాహసం, అంకితభావం, పోరాటాన్ని అభినందించాలి అని అన్నారు. ఆటిజం ఒక వ్యాధి అనే అపోహను సమాజం వీడాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. ప్రజలు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. మాధవ్ ఆటిజమ్ ఫౌండేషన్‌కు ఆయన అభినందనలు తెలిపారు.



ప్రతిభను గుర్తిస్తే అద్భుత ఫలితాలు

ఆటిజం ఉన్న పిల్లల్లో ప్రతి ఒక్కరి ఆసక్తి, ప్రతిభను గుర్తించడం అత్యంత కీలకమని గవర్నర్ తెలిపారు. దీనికి ఉదాహరణగా తారే జమీన్ పర్ చిత్రాన్ని ప్రస్తావించారు. సాధారణంగా చదువులో ఇబ్బంది పడుతున్న ఓ బాలుడిలో దాగి ఉన్న చిత్రకళా ప్రతిభను ఉపాధ్యాయుడు గుర్తించి ప్రోత్సహిస్తే, అతడు గొప్ప కళాకారుడిగా ఎదిగిన కథను గుర్తుచేశారు. పిల్లల ఆసక్తిని గుర్తించి అదే దిశగా శిక్షణ ఇస్తే వారి సామర్థ్యం వెలుగులోకి వస్తుంది అని చెప్పారు. 14 వేల మంది పిల్లల కోసం సాగుతున్న సేవలు ఎంతో గొప్పవని పేర్కొన్నారు.

'అసాధారణం' కాదు.. ప్రత్యేకమైన పిల్లలు

ఆటిజం ఉన్న పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ 'అసాధారణం' అని పిలవకూడదని శివ ప్రతాప్ శుక్లా స్పష్టం చేశారు. వారు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలుగా చూడాలని, ఆటిజం అనేది న్యూరో డెవలప్‌మెంట్‌కు సంబంధించిన స్థితి అని వివరించారు. కొందరు పిల్లలు దూకుడుగా ఉండవచ్చు, మరికొందరు ప్రశాంతంగా ఉండవచ్చు. వారి ప్రవర్తనను అర్థం చేసుకుని తగిన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కొవిడ్ తర్వాత ఇటువంటి పిల్లల సంఖ్య పెరిగినట్టు తనకు అనిపిస్తోందని పేర్కొన్న గవర్నర్, వారి అవసరాలను గుర్తించడం, శిక్షణ ఇవ్వడం, కుటుంబాల్లో అవగాహన పెంచడం అత్యవసరమన్నారు. ప్రతి కుటుంబం ఆటిజం ఉన్న బిడ్డను కూడా సమానంగా ముఖ్యమైన బిడ్డగా చూడాలని పిలుపునిచ్చారు.

సందీప్ సుల్తానియా: సమాజం బాధ్యత పెంచుకోవాలి

ఆటిజం ఉన్న పిల్లలను ప్రత్యేక శ్రద్ధతో అర్థం చేసుకుని, వారి సామర్థ్యాలను వెలికితీయడం సమాజం బాధ్యత అని ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. ఆటిజం ఉన్న పిల్లలను సాధారణ పిల్లలతో పోల్చి చూడకుండా, వారి ప్రత్యేక అవసరాలను గుర్తించి తగిన సహకారం అందించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, వైద్య నిపుణులు కలిసి పనిచేస్తే పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు. అవగాహన, శిక్షణ, కుటుంబ మద్దతు ద్వారా ఆటిజం ఉన్న పిల్లలు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ఎదిగే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పిల్లల ప్రవర్తనను సమస్యగా చూడకుండా, దాని వెనుక ఉన్న కారణాన్ని అర్థం చేసుకోవడం అవసరమన్నారు. ఆటిజంపై ఉన్న అపోహలను తొలగించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ప్రతి బిడ్డలోనూ ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించేందుకు సమాజం కలసికట్టుగా కృషి చేయాలని సందీప్ సుల్తానియా పిలుపునిచ్చారు.

ప్రతి బిడ్డలో ప్రతిభ ఉంది: సుమన్ సరాఫ్

ఆటిజం ఉన్న పిల్లలను సమాజం అర్థం చేసుకోవాలి, వారిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని మాధవ్ ఆటిజమ్ ఫౌండేషన్ చైర్మన్ సుమన్ సరాఫ్ అన్నారు. గత పదేళ్లుగా ఆటిజంపై అవగాహన కల్పిస్తూ, పిల్లలకు అవసరమైన శిక్షణ అందించేందుకు ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటివరకు 14 వేల మంది పిల్లలకు సేవలు, మార్గదర్శనం అందించడం తమకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఆటిజం ఒక వ్యాధి అనే అపోహను తొలగించడంతో పాటు, ఇది పిల్లల న్యూరో డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రత్యేక స్థితి అని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పిల్లవాడి ఆసక్తి, సామర్థ్యం, ప్రవర్తనను ప్రత్యేకంగా అర్థం చేసుకుని శిక్షణ అందిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. కుటుంబ సభ్యులు పిల్లలను ఇతరులతో పోల్చకుండా వారి ప్రతిభకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రేమ, సహనం, అవగాహన, సరైన శిక్షణ అందిస్తే ఆటిజం ఉన్న పిల్లలు కూడా ఆత్మవిశ్వాసంతో ఉన్నత స్థాయికి ఎదగగలరని సుమన్ సరాఫ్ స్పష్టం చేశారు.



భారత్ డిజిటల్ దూకుడు

- టెక్నాలజీతో దిశ మార్పు
- ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీలో జరుగుతున్న 10వ ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ దేశ టెలికాం రంగంలో వచ్చిన మార్పులను వివరించారు. కరోనా సమయంలోనూ టెలికాం వ్యవస్థను విస్తరించి మారుమూల గ్రామాలకు కనెక్టివిటీ అందించామని చెప్పారు. డిజిటల్ సదుపాయాల ద్వారా పల్లె ప్రజలకు బ్యాంకింగ్, వైద్యం, ప్రభుత్వ సేవలు సులభంగా అందుతున్నాయని తెలిపారు. టెలికాం సంస్కరణలతో పాలనలో పారదర్శకత పెరిగిందని, పేదలకు చేరాల్సిన సుమారు రూ.5 లక్షల కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టకుండా కాపాడగలిగామని పేర్కొన్నారు. సంస్కరణలకు ఎలాంటి వ్యతిరేకత ఎదురైనా వాటి అమలు ఆగదని స్పష్టం చేశారు.

5జీ విస్తరణతో కొత్త వేగం

దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ నెట్‌వర్క్ చేరిందని మోదీ తెలిపారు. ప్రస్తుతం 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు సేవలందిస్తున్నాయని చెప్పారు. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం పదిరెట్లు పెరిగిందని వెల్లడించారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఇన్వెస్ట్', 'ఇన్నోవేట్'తో మొబైల్స్, టెలికాం పరికరాల తయారీలో భారత్ ప్రపంచ కేంద్రంగా ఎదుగుతోందని అన్నారు. అదే సమయంలో డీప్‌ఫేక్స్, సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫోన్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డీప్‌ఫేక్స్‌ను అడ్డుకునేందుకు ప్రభుత్వాలు, టెక్ సంస్థలు, ఆర్థిక రంగాలు కలిసి అంతర్జాతీయ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయాలని కోరారు. 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తయిన సమయంలో ఐఎంసీ 10వ వార్షికోత్సవం జరగడం ప్రత్యేకమని మోదీ పేర్కొన్నారు.



వ్యాపారులకు భారీ ఊరట

- అరెస్ట్ అధికారాలకు చెక్
- ప్రాసిక్యూషన్ పరిమితి పెంపు
- జీఎస్టీ భారీ సంస్కరణలు

వ్యాపార రంగానికి ఊరటనిచ్చేలా 57వ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో జీఎస్టీ ఆఫీసర్ల అరెస్ట్ అధికారాలను రద్దు చేయాలని నిర్ణయించింది. పన్ను నిబంధనల అమలులో వ్యాపారులపై ఒత్తిడి తగ్గించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యంగా సంస్కరణలు చేపట్టింది. నిర్దిష్ట సమాచారం ఆధారంగా మాత్రమే సరకు రవాణాను అడ్డుకుని తనిఖీ చేసే విధానాన్ని కొనసాగించనున్నారు.

ప్రాసిక్యూషన్ పరిమితి పెంపు

జీఎస్టీ చట్టం కింద నేర విచారణ ప్రారంభించే పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచింది. ఇకపై జరిమానా, జైలు శిక్ష లేదా రెండింటిలో ఏది విధించాలన్నది కేసు స్వభావాన్ని బట్టి న్యాయస్థానాల విచక్షణకు వదిలేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. నిర్దిష్ట జరిమానా లేని ఉల్లంఘనలకు విధించే సాధారణ జరిమానాను కూడా రూ.25 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించింది. చిన్న పొరపాట్లు, రిటర్నుల ఆలస్యం, పన్ను చెల్లింపులో జాప్యం వంటి సందర్భాల్లో కఠిన చర్యలకు బదులుగా నిబంధనలకు అనుగుణంగా పన్ను, వడ్డీ, జరిమానాతో వ్యవహరించనున్నారు.

ఐటీసీపై కీలక పరిశీలన

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ విషయంలోనూ కౌన్సిల్ ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. సరైన ఇన్వాయిస్ కలిగి, సరకు స్వీకరించి, సరఫరాదారుకు పూర్తి చెల్లింపు చేసిన నిజమైన కొనుగోలుదారులకు రక్షణ కల్పించే మార్గాలను పరిశీలించేందుకు అధికారుల కమిటీని ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీ మూడు నెలల్లో అధ్యయనం పూర్తి చేసి తదుపరి జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి నివేదిక సమర్పించనుంది. దీంతో నిజాయితీగా పన్ను నిబంధనలు పాటించే వ్యాపారులకు మరింత స్పష్టత లభించే అవకాశం ఉంది.

రేట్ల కంటే సరళీకరణకు ప్రాధాన్యం

జీఎస్టీ రేట్ల మార్పుల కంటే పన్ను వ్యవస్థను సులభతరం చేయడంపైనే ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి పెట్టినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇకపై జీఎస్టీ రేట్ల మార్పులు ఏడాదికి ఒక్కసారి మాత్రమే జరిగేలా విధానం తీసుకురానున్నారు. కఠిన పన్ను విధానాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపార వర్గాలకు తాజా నిర్ణయాలు గణనీయమైన ఉపశమనాన్ని ఇవ్వనున్నాయి. అరెస్ట్ అధికారాల తొలగింపు, ప్రాసిక్యూషన్ పరిమితి పెంపు, సాధారణ జరిమానా తగ్గింపు వంటి చర్యలతో జీఎస్టీ అమలు మరింత సరళంగా, పారదర్శకంగా మారే అవకాశం ఉంది.

నేడు ప్రొద్దుటూరుకు కొత్త బస్టాండ్ ప్రారంభం



ప్రొద్దుటూరు ప్రజల దీర్ఘకాల నిరీక్షణకు తెరపడనుంది. పట్టణంలో నూతనంగా నిర్మించిన బస్టాండ్‌ను శుక్రవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. ఆధునిక వసతులతో అందుబాటులోకి రానున్న కొత్త బస్టాండ్ ద్వారా ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గురువారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రారంభోత్సవ వివరాలను వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న శ్రీశక్తి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు 100 కోట్ల మైలురాయిని దాటాయని వరదరాజులరెడ్డి తెలిపారు. ఒకే మహిళ పలుమార్లు ప్రయాణించినా, మొత్తం ప్రయాణాలను లెక్కిస్తే ఈ సంఖ్య 100 కోట్లు దాటడం పథకం విస్తృత వినియోగానికి నిదర్శనమన్నారు. నూతన బస్టాండ్ ప్రారంభోత్సవానికి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ప్రొద్దుటూరులో వైసీపీలోకి చేరికలు



ప్రొద్దుటూరు 24వ వార్డులో టీడీపీకి చెందిన సుమారు 80 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కుటుంబ సభ్యులు వైసీపీ కండువాలు కప్పుకున్నారు. 24వ వార్డు ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాచమల్లు శివప్రసాద్‌రెడ్డితో పాటు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పంశేధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ పంశేధర్‌రెడ్డి తదితరులు కొత్తగా చేరిన వారికి స్వాగతం పలికారు. వైసీపీ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ఆలోచనలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు కొత్త సభ్యులు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి పనిచేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి వైసీపీ కట్టుబడి ఉందన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ గౌరవం, సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజేష్, వంశీ, కదరయ్య, గణేష్, హర్ష, రమణ, శివ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల కోసం పరిచయస్తురాలి ఇంటికే కన్నం



ప్రొద్దుటూరులో అప్పులు తీర్చుకునేందుకు పరిచయస్తురాలి ఇంటినే లక్ష్యంగా చేసుకున్న మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. జడలగారి వీధికి చెందిన పోట్లూదుర్తి సుజాత కుటుంబంతో హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో ఈ నెల 4న మధ్యాహ్నం రుద్రాల రమాదేవి (40) నకిలీ తాళంచెవితో ఇంట్లోకి ప్రవేశించి బీరువా లాకర్‌లోని బంగారు ఆభరణాలు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. సుజాత ఇంటికి తిరిగి వచ్చి నగలు కనిపించకపోవడంతో ప్రొద్దుటూరు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఈ నెల 7న అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా... నకిలీ తాళం తయారు చేయించుకున్నట్లు గుర్తించారు. ఆమె నుంచి 58.857 గ్రాముల బంగారం, రూ.2.40 లక్షల విలువైన బ్రాస్‌లెట్, చైన్లు, ఉంగరాలు, డాలర్లు తదితర ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల పనితీరును జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.

కేజీబీవీకి కొత్త భవనాలు.. విద్యకు ఊతం



చక్రాయపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.1.19 కోట్ల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాలు ప్రారంభమయ్యాయి. పులివెందుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో పలు సంస్కరణలు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కేజీబీవీల్లో వసతులు అందించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసీ అనురాధ, ఎంపీడీవో శివారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓటు రక్షణకు ఇండియా కూటమి పోరాటం



కడపలో 'సేవ్ డెమోక్రసీ-ఓట్ బచావో-దేశ్ బచావో' నినాదంతో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డీసీసీ కార్యాలయం నుంచి నూతన కలెక్టర్ కార్యాలయం వరకు సాగిన ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ ఎన్నికల ప్రధాన అధికారిగా తన అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే స్పందించి ఎన్నికల ప్రక్రియపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య పరీక్షలతో వ్యాధులకు ముందస్తు చెక్



ప్రొద్దుటూరులోని శ్రీరాములపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు శిబిరంలో సాధారణ పరీక్షలతో పాటు రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రోగుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. గీత మాట్లాడుతూ అసంక్రమణ వ్యాధులు, రక్తహీనత, పోషకాహారం, మాతాశిశు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, కుటుంబ నియంత్రణ, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డా. మధుకుమార్, డా. మురళీకృష్ణారెడ్డి, గైనకాలజిస్ట్ డా. జయసత్య, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రఘురామిరెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై అమిత్ షాతో చర్చ





ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను ఈ సమావేశంలో ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చాలాకాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర సహకారం అవసరమని వివరించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, విభజన హామీలు, కేంద్రం నుంచి రావాల్సిన సహాయ సహకారాలు, పెండింగ్ అనుమతులపై చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్ర సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు.

సముద్ర ఆర్థిక రంగంపై బాబు దృష్టి

ఆంధ్రప్రదేశ్ లో సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాలను విస్తరించేందుకు కేంద్ర సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. కేంద్ర ఓడరేవులు, నౌకాయాన శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తో భేటీ అయిన సీఎం రాష్ట్రంలోని పోర్టుల అభివృద్ధిపై కీలకంగా చర్చించారు. మూలపేట పోర్టులో టెర్మినల్ ఏర్పాటు చేయడంతో పాటు దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటు అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర తీర ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం, పోర్టుల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చంద్రబాబు వివరించారు. కేంద్రం అవసరమైన అనుమతులు, సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

కర్నూలులో వైఎస్సార్‌సీపీ నేతలకు నోటీసులు



కర్నూలు అర్బన్‌లో వైఎస్సార్ సీపీ నేతలకు పోలీసుల నోటీసుల వ్యవహారం కొనసాగుతోంది. ఎన్నికల నేపథ్యంలో కర్నూలు నియోజకవర్గానికి చెందిన 53 మంది నేతలపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేసి, స్టేషన్‌లో హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న నేతలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి హాజరయ్యారు. వీరిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, సిటీ అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్ తదితరులు ఉన్నారు. డీఎస్పీ నియామకాల్లో అవకతవకలు జరిగాయంటూ నిర్వహించిన శాంతియుత ర్యాలీకి సంబంధించే తమపై కేసులు పెట్టారని వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ఒత్తిడితోనే కేసులు నమోదు చేస్తున్నారని వారు ఆరోపించారు. కేసులకు భయపడబోమని, న్యాయపరంగా ఎదుర్కొంటూనే ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ విధానాలు, అవకతవకలపై రానున్న రోజుల్లో మరింతగా పోరాడతామని ప్రకటించారు.

కేడర్ శిక్షణపై లోకేశ్ ప్రత్యేక దృష్టి





తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా శిక్షణా కార్యక్రమాలను విస్తరిస్తున్నామని పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్లతో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8,300 మంది క్లస్టర్, బూత్ ఇన్ చార్జిలకు శిక్షణ పూర్తయిందని, మొత్తం 50 వేల మందికి శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని వెల్లడించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిరంతరం నిర్వహిస్తామని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో అనుసంధానం పెంచుకోవడంతో పాటు పార్టీ విధానాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేలా కేడర్ ను తీర్చిదిద్దాలని సూచించారు. 'సమాజమే దేవాలయం- ప్రజలే దేవుళ్లు' అనే టీడీపీ మూల సిద్ధాంతాన్ని ప్రతి కార్యకర్త ఆచరణలో పెట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

చారిత్రక నవలా చక్రవర్తి శివప్రసాద్ కన్నుమూత



ప్రముఖ సాహితీవేత్త, ఆర్ఎస్ఎస్ జ్యేష్ఠ కార్యకర్త ఆచార్య ముదిగొండ శివప్రసాద్ (86) గురువారం రాత్రి 8.45 గంటలకు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ప్రకాశం జిల్లా ఆకులల్లూరుకు చెందిన ఆయన 'చారిత్రక నవలా చక్రవర్తి'గా సాహితీ లోకంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఎం.ఎ., పీహెచ్‌డీ పూర్తి చేసిన శివప్రసాద్ తొలుత సికింద్రాబాద్ వెస్లీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా, అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యుడిగా సేవలందించారు. దాదాపు 83 పుస్తకాలు రచించిన ఆయనలో 20 చారిత్రక నవలలు ఉన్నాయి. శ్రీలేఖ, శ్రావణి, తంజావూరు విజయం, సమ్రాట్ పుష్యమిత్ర, బసవగీత, వంశధార, రెసిడెన్సీ, సగం విరిగిన చంద్రుడు వంటి రచనలు విశేష ఆదరణ పొందాయి. సాహిత్యంతో పాటు జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, ఆధ్యాత్మికత, వైదిక వాఙ్మయంపై ఆయనకు లోతైన అవగాహన ఉంది. క్రైస్తవం, మతమార్పిళ్లు, విద్యా వ్యవస్థ అంశాలపై వ్యాసాలు, ప్రసంగాలు చేశారు. ఆయన మరణం తెలుగు సాహిత్యానికి, జాతీయవాద భావజాలానికి తీరని లోటుగా పలువురు పేర్కొన్నారు.

కల్తీ ధనియాల పొడి భారీగా పట్టుబాటు



ప్రొద్దుటూరులో కల్తీ ధనియాల పొడి తయారీపై విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. కడప రీజినల్ విజిలెన్స్ ఎస్పీ ఎన్.వెంకట రామాంజనేయులు ఆదేశాలతో బుధవారం మండి బజార్ రోడ్డులోని జ్యోతి అండ్ కంపెనీలో విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. రసాయనాలు కలిపి కృత్రిమంగా ధనియాల పొడి తయారు చేస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించగా, 1,93,540 కిలోల ధనియాల పొడి నిల్వలు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.1.48 కోట్లుగా అధికారులు నిర్ధారించారు. ఈ వ్యవహారంపై గాజులపల్లి రమేష్, గాజులపల్లి వినయ్ పై ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్ స్పెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఏఓజి. లక్ష్మణకుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే.. టీటీడీ ప్రక్షాళనకు ధార్మిక బోర్డు



పార్టీ ఏర్పాటు నేపథ్యంలో సాయిరెడ్డి

మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి, కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు నేపథ్యంలో తిరుపతిపై కీలక హామీలు ప్రకటించారు. గురువారం తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తమ పార్టీ అధికారంలోకి వస్తే తిరుపతి నగరంలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తామని చెప్పారు. రాజకీయ ప్రతినిధులతో కూడిన టీటీడీ పాలక మండలిని తొలగించి, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చేలా సాధువులు, స్వామీజీలతో ధార్మిక బోర్డు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. టీటీడీ వ్యవస్థలో సమగ్ర ప్రక్షాళన చేపడతామని స్పష్టం చేశారు.

తిరుమల భద్రత కేంద్రానికి!

తిరుమల తిరుపతి భద్రతను కేంద్ర దర్యాప్తు, భద్రతా సంస్థలకు అప్పగించాలని విజయసాయి రెడ్డి ప్రతిపాదించారు. ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రానికి బాహ్య సంస్థల నుంచి ముప్పు ఉందని పేర్కొంటూ, తిరుమల కొండల చుట్టూ రక్షణ పరిధి ఏర్పాటు చేయాలని సూచించారు. అభివృద్ధి పేరుతో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆయన ఆరోపించారు. కరువుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాయలసీమకు దీర్ఘకాలిక పరిష్కారంగా జలాశయాలు నిర్మించాల్సిన అవసరం ఉందని, హామీలకే పరిమితం కాకుండా నీటి సమస్యను పరిష్కరించాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని విమర్శించారు.

జగన్‌పై రాజకీయ విమర్శలు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులం, మతాన్ని రాజకీయంగా వినియోగిస్తున్నారని విజయసాయి రెడ్డి ఆరోపించారు. సనాతన ధర్మం, హిందూ సమాజానికి సంబంధించిన అంశాలపై తన వైఖరిని స్పష్టం చేయాలని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్‌పై కేంద్ర ప్రభుత్వ చర్యలను ఆయన సమర్థించారు. ఓటర్ల జాబితా నుంచి మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారి పేర్లను తొలగించడంతో పాటు అక్రమ వలసదారులను గుర్తించేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.

లంకమల్లలో ఎర్రచందనం దుంగలు పట్టివేత



లంకమల్ల రిజర్వ్ ఫారెస్ట్ లో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న స్మగ్లర్లపై అటవీ శాఖ అధికారులు దాడి చేశారు. 234 కిలోల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా అటవీ శాఖాధికారి నుంచి గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అందిన సమాచారంతో ప్రొద్దుటూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఆధ్వర్యంలో సిబ్బంది నాగసానిపల్లి బీట్ లోని బిక్కితిప్ప ప్రాంతం, లంకమల్ల ఆర్ ఎఫ్ లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రచందనం తరలిస్తున్న స్మగ్లర్లను గుర్తించి దాడి చేయగా, అటవీ సిబ్బంది రాకను గమనించిన స్మగ్లర్లు దుంగలను అక్కడే వదిలి అడవిలోకి పరారయ్యారు.

4.88 లక్షల ఫామ్-6లు

కొత్తగా ఓటు కోసంపెద్ద సంఖ్యలో దరఖాస్తులు



తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కొత్త ఓటు కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 4,88,417 ఫామ్6 దరఖాస్తులు అందినట్లు రాష్ట్ర ఎన్నికల కార్యాలయం వెల్లడించింది. విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి 6,270 ఫామ్ 6A దరఖాస్తులు వచ్చాయి. ఓటర్ల చిరునామా, ఇతర వివరాల మార్పుల కోసం 5,04,782 ఫామ్8 దరఖాస్తులు అందాయి. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు అక్టోబర్ 7తో ముగిసింది.

తొలగింపుపై ఫామ్-7లు

ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు కోసం ఫామ్7 ద్వారా వచ్చిన దరఖాస్తులపై అధికారులు పరిశీలన కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల నుంచి మొత్తం 6,335 ఫామ్7లు అందాయి. ఇప్పటివరకు 2,066 ఫామ్7లను తొలగించినట్లు ఎన్నికల కార్యాలయం తెలిపింది. ముషీరాబాద్ లో 151 దరఖాస్తులు రాగా 87 తొలగించారు. గోషామహల్ లో 222 దరఖాస్తులకు 87 తొలగింపులు జరిగాయి. హైదరాబాద్ లో బల్క్ గా సమర్పించిన ప్రీఫిల్డ్ ఫామ్7ల వ్యవహారం కూడా రాజకీయ చర్చకు దారితీసింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోనే అధికం

కొత్త ఓటు నమోదు కోసం రాష్ట్రంలోనే అత్యధిక ఫామ్6 దరఖాస్తులు హైదరాబాద్ జిల్లా నుంచి వచ్చాయి. జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 1,93,135 ఫామ్6లు దాఖలయ్యాయి. వీటిలో ఇప్పటివరకు 29,226 దరఖాస్తులు ఆమోదం పొందాయి. అదే ప్రాంతం నుంచి 4,127 మంది ఎన్ఆర్ఐలు ఓటు నమోదు కోసం ఫామ్6A దరఖాస్తులు చేసుకున్నారు. ఓటర్ల చిరునామా, ఇతర వివరాల మార్పుల కోసం 1,44,495 ఫామ్ 8లు అందాయి.


నవంబర్ 9న తుది జాబితా

అందిన దరఖాస్తులు, అభ్యంతరాలను ఎన్నికల అధికారులు నవంబర్ 5లోగా పరిష్కరించనున్నారు. అనంతరం నవంబర్ 9న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. దీంతో సర్ ప్రక్రియ తర్వాత తెలంగాణలో మొత్తం ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, వివరాల సవరణ కోరినవారు తుది జాబితా వెలువడిన తర్వాత తమ పేరు, వివరాలు సరిగ్గా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు.

ఏపీలో మూడో కూటమి నిర్మాణం

బీజేపీ-జనసేన నీడకు సాయిరెడ్డి..!

వేణుంబాక వాస్తవ రూపం ఇదేనా..?



రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరు.. శాశ్వత మిత్రులు కూడా ఉండరు. అధికారం ఉన్నప్పుడు ఒక మాట.. అధికారం దూరమైనప్పుడు మరో మాట.. రాజకీయ అవసరాలు మారిన కొద్దీ సిద్ధాంతాలు, ఆరోపణలు, అనుబంధాల అర్థాలు కూడా మారిపోతుంటాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం విజయసాయి రెడ్డి వ్యవహారం కూడా అలాంటి కొత్త చర్చకు తెరదీస్తోంది. ఒకప్పుడు వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా, పార్టీలో రెండో స్థానంలో ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందిన వ్యక్తి.. ఇప్పుడు అదే జగన్‌ను లక్ష్యంగా చేసుకుని వరుస విమర్శలు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. నిన్నటి వరకు తనకు రాజకీయంగా నీడనిచ్చిన చెట్టు కొమ్మపైనే ఇప్పుడు గొడ్డలి పెట్టారా? లేక తాను నిలబడబోయే కొత్త రాజకీయ నీడ కోసం ఆ కొమ్మను ముందుగానే నరికేస్తున్నారా? ఇదే అసలు ప్రశ్న. విజయసాయి రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని చూస్తే ఈ పరిణామం సాధారణ రాజకీయ విభేదంగా కొట్టిపారేయడం అంత సులభం కాదు. వైఎస్ కుటుంబంతో ఆయనకు ఉన్న సుదీర్ఘ అనుబంధం, జగన్ అక్రమాస్తుల కేసులో జగన్‌తో పాటు ఆయన జైలుకు వెళ్లడం, అనంతరం వైసీపీలో కీలక బాధ్యతలు చేపట్టడం.. ఇవన్నీ ఆయన జగన్‌కు ఎంత దగ్గరగా ఉన్నారో చెప్పే రాజకీయ చరిత్ర. రాజ్యసభ సభ్యత్వం నుంచి పార్లమెంటరీ పార్టీ నాయకత్వం, జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయి వరకు ఎదిగిన ఆయనను ఒక దశలో జగన్ తర్వాత పార్టీలో అత్యంత ప్రభావశీల వ్యక్తిగా చూశారు. ఢిల్లీలో వైసీపీ వ్యవహారాలను చక్కబెట్టే బాధ్యతలోనూ ఆయనకు ప్రాధాన్యం ఉండేది. కేంద్రంలోని పెద్దలతో సంబంధాలు కొనసాగించడంలోనూ ఆయన పాత్రపై అప్పట్లో అనేక చర్చలు జరిగాయి. అంటే జగన్ రాజకీయ సామ్రాజ్యంలో బయట నిలబడి విమర్శించిన వ్యక్తి కాదు సాయిరెడ్డి.. ఆ సామ్రాజ్య నిర్మాణంలో ఒక కీలక ఇటుకగా ఉన్న వ్యక్తి.



• వీడ్కోలు మాట.. కొత్త బాట.. సాయిరెడ్డి ఆట!

అయితే 2025 జనవరిలో ఒక్కసారిగా రాజకీయాలకు గుడ్‌బై చెబుతున్నానని, వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించడం పెద్ద రాజకీయ ప్రశ్నగా మారింది. రాజ్యసభకు, వైసీపీకి రాజీనామా చేయడం వెనుక వ్యక్తిగత నిర్ణయమే ఉందని ఆయన చెప్పినా.. ఆ తర్వాత చేసిన వ్యాఖ్యలు అసలు కథ వేరే ఉందనే సంకేతాలను ఇచ్చాయి. జగన్ చుట్టూ ఒక కోటరీ ఏర్పడి తనను దూరం చేసిందని, తాను ఒకప్పుడు రెండో స్థానంలో ఉండగా 2000 స్థానానికి నెట్టివేశారని, తనపై వెన్నుపోటు పొడుస్తాడనే ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఇక్కడే రాజకీయ విభేదానికి వ్యక్తిగత ఆవేదన కలిసింది. అయితే ఒకప్పుడు జగన్‌కు అత్యంత సమీపంగా ఉన్న వ్యక్తి ఇలా బయటకు రావడం ఒక్కటే కాదు.. బయటకు వచ్చిన తర్వాత ఆయన ఎంచుకున్న రాజకీయ అంశాలు, ఎవరిపై దాడి చేస్తున్నారు, ఎవరిని మాత్రం దాదాపుగా పదిలేస్తున్నారు అన్నదే ఇప్పుడు మరింత ఆసక్తికరంగా మారింది. విజయసాయి రెడ్డి వ్యవహారంలో ఢిల్లీ కోణాన్ని కూడా విస్మరించలేం. రాజ్యసభలో ఉన్న సమయంలో బీజేపీ అగ్రనాయకత్వంతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆయనే పలుమార్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ తనను గుర్తుపట్టి పలకరించేవారని, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలవడానికి అపాయింట్‌మెంట్ సులభంగా లభించేదని ఆయన చెప్పిన సందర్భాలు ఉన్నాయి. రాజ్యసభకు రాజీనామా చేసిన సమయంలోనూ మోదీ, అమిత్ షాలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 2024 ఎన్నికల ముందు వైసీపీ-బీజేపీ మధ్య రాజకీయ అవగాహనకు ప్రయత్నాలు జరిగాయన్న చర్చలో సాయిరెడ్డి పేరు వినిపించింది. ఆ ప్రయత్నం ఫలించలేదు. కానీ సంబంధాలు పూర్తిగా తెగిపోయాయా? అన్నది వేరే ప్రశ్న. రాజకీయాల్లో తలుపు మూసినా కిటికీ తెరిచి ఉంచడం అనేది కొత్త విషయం కాదు.

మారిన మాట.. కొత్త బాట.. కొత్త ఆట!

ఇక్కడి నుంచే సాయిరెడ్డి భవిష్యత్ రాజకీయ ప్రయాణంపై ఊహాగానాలు మొదలయ్యాయి. బీజేపీలో చేరతారా? కేంద్ర స్థాయిలో ఏదైనా బాధ్యత దక్కుతుందా? గవర్నర్ వంటి రాజ్యాంగ పదవి దిశగా చూస్తున్నారా? లేక ప్రాంతీయ రాజకీయాల్లో కొత్త వేదిక నిర్మించాలనుకుంటున్నారా? ఇవేవీ అధికారికంగా నిర్ధారణ కాలేదు. కానీ రాజకీయ నాయకుడి అడుగులు మాత్రమే కాదు.. ఆయన వేసే రాజకీయ ప్రశ్నలు కూడా భవిష్యత్తు దిశను సూచిస్తాయి. ఇటీవల ఆయన ఎంచుకుంటున్న అంశాలను పరిశీలిస్తే, ఒకప్పుడు వైసీపీ వేదికపై మాట్లాడిన సాయిరెడ్డి కంటే ఇప్పుడు పూర్తిగా భిన్నమైన రాజకీయ భాష వినిపిస్తోంది. దానికి ప్రధాన ఉదాహరణ మతమార్పిడుల అంశం. సెప్టెంబర్ 23, 2026న గత రెండు దశాబ్దాల్లో జరిగిన మతమార్పిడులపై విచారణ జరిపేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని, హిందుత్వానికి ద్రోహం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సాయిరెడ్డి డిమాండ్ చేయడం రాజకీయంగా సాధారణ వ్యాఖ్య కాదు. ఈ అంశం నేరుగా వైఎస్ రాజశేఖరరెడ్డి కాలం నుంచి జగన్ పాలన వరకు విస్తరించే రాజకీయ చర్చకు తలుపు తెరుస్తుంది. ముఖ్యంగా వైఎస్ కుటుంబానికి క్రైస్తవ మతంతో ఉన్న అనుబంధం, వైసీపీ పాలనలో చర్చిలకు నిధులు, మతమార్పిడుల ఆరోపణలు వంటి అంశాలను బీజేపీ అనుకూల వర్గాలు చాలాకాలంగా రాజకీయ ఆయుధాలుగా ఉపయోగిస్తున్నాయి. అలాంటి అంశాన్ని ఒకప్పుడు వైసీపీలో అత్యంత కీలక స్థానంలో ఉన్న సాయిరెడ్డి ఇప్పుడు ముందుకు తీసుకురావడం సహజంగానే ప్రశ్నలను రేకెత్తిస్తోంది.

• నాటి నీడ.. నేటి వాదం.. కొత్త వివాదం!

ఇక్కడ ఒక అసౌకర్యమైన ప్రశ్న తప్పదు. వైసీపీలో అంత కీలక స్థానంలో ఉన్నప్పుడు ఈ అంశాలు సాయిరెడ్డికి తెలియవా? తెలిసి ఉంటే అప్పుడెందుకు మాట్లాడలేదు? తెలియకపోతే ఆయనకు అప్పట్లో పార్టీలో ఉన్న అసలు ప్రాధాన్యం ఎంత? రాజకీయంగా బయటకు వచ్చిన తర్వాతే ఒక అంశం తప్పుగా కనిపించడం ఎందుకు? ఇవి రాజకీయ ప్రత్యర్థులు వేస్తున్న ప్రశ్నలు. వీటికి సమాధానం చెప్పాల్సింది సాయిరెడ్డే. అయితే ఆయన చేస్తున్న విమర్శల వెనుక రాజకీయ సిద్ధాంత మార్పు ఉందా, లేక రాజకీయ పునరావాసానికి అవసరమైన కొత్త భాషను ఎంచుకున్నారా అన్నది కాలమే తేల్చాలి. వైసీపీ వైపు నుంచి వచ్చిన ప్రతిస్పందన కూడా ఇదే కోణాన్ని బలపరుస్తోంది. సజ్జల రామకృష్ణారెడ్డి సాయిరెడ్డి విమర్శలను యాంటీ-జగన్ ప్రచారంగా అభివర్ణిస్తూ, జగన్‌కు మతమార్పిడులు చేయాలనే ఉద్దేశం ఉంటే దశాబ్దాలుగా ఆయనతో ఉన్న సాయిరెడ్డినే ముందుగా మార్చేవారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలో రాజకీయ వ్యంగ్యం ఎంత ఉందో పక్కన పెడితే, వైసీపీ ఇప్పుడు సాయిరెడ్డిని తమ మాజీ సహచరుడిగా మాత్రమే కాకుండా రాజకీయ ప్రత్యర్థిగా చూస్తోందన్న విషయం మాత్రం స్పష్టమవుతోంది. ఒకప్పుడు పార్టీలోని అంతర్గత నిర్ణయాల్లో భాగమైన వ్యక్తి.. ఇప్పుడు బయట నుంచి పార్టీ విధానాలనే ప్రశ్నించడం వైసీపీకి అసౌకర్యకరమైన పరిస్థితి.

• ఎవరిపై దాడి.. ఎవరితో జోడీ.. సాయిరెడ్డి వ్యూహమిదే!

అయితే అసలు మర్మం మరోచోట ఉంది. సాయిరెడ్డి ఎవరిని ఎంతగా విమర్శిస్తున్నారు? ఎవరిని మాత్రం విమర్శించడం లేదు? రాజకీయ పరిశీలకులకు ఈ ప్రశ్నే ఇప్పుడు కీలకం. జగన్‌పై, సజ్జలపై, వైసీపీ అంతర్గత వ్యవహారాలపై ఆయన తీవ్రంగా మాట్లాడుతున్నారు. అవసరమైనప్పుడు టీడీపీపై కూడా విమర్శలు చేస్తున్నారు. కానీ కూటమిలోని జనసేన, బీజేపీలపై ఆయన విమర్శల తీవ్రత మాత్రం అదే స్థాయిలో కనిపించడం లేదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఇది యాదృచ్ఛికమా? లేక భవిష్యత్ రాజకీయ లెక్కల్లో భాగమా? అన్నదే చర్చ. టీడీపీని మాత్రం కొంతవరకు లక్ష్యంగా చేసుకోవడం, జనసేన-బీజేపీలను ఎక్కువగా దూరంగా ఉంచడం వెనుక సాయిరెడ్డి చెబుతున్న రాజకీయ లెక్కను కూడా గమనించాలి. కూటమిలో నిర్ణయాత్మక శక్తి టీడీపీ అని, మిగిలిన రెండు పార్టీలకు రాష్ట్ర రాజకీయాల్లో పరిమిత స్థాయి ప్రభావమే ఉందని ఆయన భావిస్తున్నారనే వాదన ఉంది. కానీ రాజకీయ వ్యూహకర్తల దృష్టిలో మరో లెక్క ఉండొచ్చు. భవిష్యత్తులో టీడీపీకి ప్రత్యామ్నాయంగా జనసేన-బీజేపీ రాజకీయ సమీకరణ బలపడితే, ఇప్పటి నుంచే ఆ రెండు పార్టీలతో పూర్తిగా తలుపులు మూసుకోవడం ఎందుకు? రాజకీయాల్లో ఈరోజు వేసిన మాట రేపటి పొత్తుకు అడ్డంకి కావచ్చు. అందుకే మాటల్లో కూడా పెట్టుబడి పెట్టాలి. సాయిరెడ్డి రాజకీయ భాషను పరిశీలిస్తున్నవారు ఇదే కోణంలో చూస్తున్నారు.

• వీడ్కోలు మాట.. పార్టీ బాట.. జగన్‌కి ముప్పు మాట!

మరోవైపు, సెప్టెంబర్ 7న కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి ఆయన చేసిన ప్రకటన ఈ చర్చకు మరింత బలం చేకూర్చింది. విజయదశమి తర్వాత పార్టీ పేరును ప్రకటిస్తానని, రాయలసీమ అభివృద్ధి, కులాల ప్రాతినిధ్యం వంటి అంశాలను ముందుకు తెస్తానని చెప్పడం ద్వారా ఆయన రాజకీయంగా పూర్తిగా నిష్క్రమించే ఉద్దేశంలో లేరన్నది మాత్రం స్పష్టమైంది. వ్యవసాయం చేసుకుంటానని చెప్పి రాజకీయాలకు వీడ్కోలు పలికిన వ్యక్తి కొద్ది కాలానికే కొత్త పార్టీ గురించి మాట్లాడుతున్నారంటే మధ్యలో ఏదో రాజకీయ లెక్క మారిందని అనుకోవడం సహజం. కానీ ఆ లెక్క జగన్‌పై వ్యక్తిగత ప్రతీకారమా? లేక తనకు కొత్త రాజకీయ స్థానం సంపాదించుకునే ప్రయత్నమా? రెండింటి మిశ్రమమా? అన్నది ఇంకా తేలాల్సి ఉంది. ఇక్కడే "విజయసాయి రెడ్డి లక్ష్యం జగనేనా?" అన్న ప్రశ్నకు అసలు అర్థం వస్తుంది. జగన్‌ను ఆయన కేవలం విమర్శిస్తున్నారా? లేక జగన్ రాజకీయ పునరాగమనానికి ముందుగానే అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేస్తున్నారా? ఒక మాజీ నెంబర్-2 నాయకుడికి జగన్ బలహీనతలు, పార్టీ అంతర్గత వ్యవస్థ, నాయకత్వ లోపాలు, ఢిల్లీ సంబంధాలు, ఆర్థిక-రాజకీయ వ్యవహారాలపై ఇతరుల కంటే ఎక్కువ అపగాహన ఉండటం సహజం. అలాంటి వ్యక్తి బయటకు వచ్చిన తర్వాత చేసే ప్రతి వ్యాఖ్యను రాజకీయ వర్గాలు సాధారణ విమర్శగా తీసుకోవు. ముఖ్యంగా జగన్‌ను తిరిగి లక్ష్యంగా చేసుకుని 2029 దిశగా రాజకీయ పునర్నిర్మాణం మొదలైతే, సాయిరెడ్డి లాంటి మాజీ అంతర్గత వ్యక్తి వ్యాఖ్యలకు మరింత బరువు వస్తుంది.

• కేసుల మాట.. రాజకీయ బాట.. కొత్త శిబిరం వేట!

అయితే ఇక్కడ మరో కోణం కూడా ఉంది. సాయిరెడ్డి నిజంగా జగన్‌ను బలహీనపరచాలనుకుంటున్నారా? లేక తనపై ఉన్న కేసులు, రాజకీయ భవిష్యత్తు, ఢిల్లీ సంబంధాలు వంటి అంశాల మధ్య ఒక సురక్షిత రాజకీయ స్థానం కోసం ప్రయత్నిస్తున్నారా? వైసీపీ వర్గాలు మాత్రం మరింత తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నాయి. లిక్కర్ కేసులో తనపై ఉన్న ఆరోపణలు, కాకినాడ పోర్ట్ వ్యవహారం, విశాఖ భూముల వివాదాలు వంటి కేసుల నేపథ్యంలో ఆయన రాజకీయంగా కొత్త శిబిరం వైపు చూస్తున్నారని విమర్శిస్తున్నాయి. అపూవర్‌గా మారితే రక్షణ లభిస్తుందనే లెక్కతోనే బీజేపీ వైపు వెళ్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కానీ ఇవి రాజకీయ ఆరోపణలు మాత్రమే. వాటిని నిర్ధారిత వాస్తవాలుగా చూడటం తగదు. ఏ కేసులోనైనా చట్టపరమైన ప్రక్రియ, దర్యాప్తు, కోర్టు నిర్ణయాలే తుది ప్రమాణం. అయితే రాజకీయ వ్యూహం పరంగా చూస్తే ఒక విషయం మాత్రం ఆసక్తికరం. సాయిరెడ్డి తన పాత రాజకీయ ఇంటిని కూల్చడానికి ముందుగా దాని గోడలనే చూపిస్తున్నారు. జగన్ చుట్టూ ఉన్న కోటరీపై దాడి చేస్తున్నారు. పార్టీ నిర్ణయాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. వైఎస్ కుటుంబ వారసత్వ రాజకీయాలపై కొత్త కోణాలు తెస్తున్నారు. మతం, హిందుత్వం, రాయలసీమ అభివృద్ధి, సామాజిక ప్రాతినిధ్యం వంటి అంశాలను తన కొత్త రాజకీయ భాషలో కలుపుతున్నారు. ఇవన్నీ కలిపి చూస్తే ఆయన కేవలం మాజీ వైసీపీ నాయకుడిగా మిగిలిపోవాలనుకోవడం లేదన్నది స్పష్టంగా కనిపిస్తోంది.

• కొత్త పార్టీ.. కొత్త బాట.. కొత్త వేట!

కానీ కొత్త పార్టీ పెట్టడం అంత సులభం కాదు. వ్యక్తిగత పరిచయాలు పార్టీగా మారవు. మీడియా దృష్టి ఓట్లుగా మారదు. ఢిల్లీ పరిచయాలు రాయలసీమలో బూత్ స్థాయి కార్యకర్తలను తయారు చేయవు. ముఖ్యంగా వైసీపీ-టీడీపీ-జనసేన-బీజేపీ వంటి బలమైన రాజకీయ వ్యవస్థలు ఉన్న రాష్ట్రంలో కొత్త పార్టీకి స్థలం సంపాదించడం అత్యంత కఠినమైన పని. సాయిరెడ్డికి ఉన్న ప్రత్యేకత ఆయనకు ఉన్న రాజకీయ సమాచారం, ఢిల్లీ పరిచయాలు, వైఎస్ కుటుంబంతో ఉన్న చరిత్ర. కానీ అదే ఆయన బలహీనత కూడా కావచ్చు. ఎందుకంటే ప్రజలు ఆయనను కొత్త రాజకీయ నాయకుడిగా చూస్తారా? లేక జగన్‌తో కలిసి పనిచేసి, ఇప్పుడు జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్న మాజీ వైసీపీ నాయకుడిగానే చూస్తారా? అన్నది తేలాల్సి ఉంది. రాయలసీమ రాజకీయాల్లో మరో సమస్య కుల సమీకరణం. కులాల ప్రాతినిధ్యం పేరుతో కొత్త రాజకీయ వేదికను నిర్మించాలంటే ఒకటి రెండు సామాజిక వర్గాల మద్దతు సరిపోదు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక నాయకత్వం, ఆర్థిక వనరులు, కార్యకర్తల నెట్‌వర్క్, గ్రామస్థాయి ప్రభావం అవసరం. సాయిరెడ్డి వీటిని ఎంతవరకు నిర్మించగలరన్నదే అసలు పరీక్ష. కేవలం జగన్ వ్యతిరేకతతో కొత్త రాజకీయ శక్తి నిలబడదు. ప్రజలకు ప్రత్యామ్నాయ పాలనా దృష్టి చూపించాలి. లేకపోతే అది వ్యక్తిగత రాజకీయ యాత్రగానే మిగిలిపోతుంది. అందుకే ఇప్పుడు జరుగుతున్న పరిణామాన్ని ఒకే రంగులో చూడడం పొరపాటు. ఒక వైపు మాజీ సహచరుడిపై వ్యక్తిగత అసంతృప్తి ఉంది. మరో వైపు తన రాజకీయ భవిష్యత్తును తిరిగి నిర్మించుకోవాలనే అవసరం ఉంది. ఇంకో వైపు ఢిల్లీ రాజకీయాలతో ఉన్న సంబంధాలను కొనసాగించాల్సిన వ్యూహం ఉంది. నాలుగో వైపు జగన్‌కు వ్యతిరేకంగా ఉన్న రాజకీయ శక్తులతో సహజమైన సామీప్యం ఏర్పడే అవకాశం ఉంది. ఈ నాలుగు అంశాలు కలిసే చోటే విజయసాయి రెడ్డి కొత్త రాజకీయ కథ మొదలవుతోంది.



• జగన్ లక్ష్యమా.. సాయిరెడ్డి వ్యూహమా.. కొత్త రాజకీయ గమనమా!

అయితే ఈ కథలో అత్యంత కీలకమైన పాత్ర జగన్‌దే. సాయిరెడ్డి ఇప్పుడు జగన్‌ను విమర్శిస్తున్నారు. జగన్ చుట్టూ ఉన్న కోటరీని ప్రశ్నిస్తున్నారు. హిందుత్వం, మతమార్పిడులు వంటి అంశాలను ముందుకు తెస్తున్నారు. జనసేన-బీజేపీలను మాత్రం అదే స్థాయిలో లక్ష్యంగా చేసుకోవడం లేదు. కొత్త పార్టీ గురించి మాట్లాడుతున్నారు. ఈ మొత్తం పరిణామం ఒక రాజకీయ పునర్‌వ్యవస్థీకరణకు సంకేతమా? లేక వ్యక్తిగత రాజకీయ పునరావాసానికి వేసిన ఎత్తుగడా? సమాధానం రాబోయే నెలల్లో బయటపడుతుంది. ఒక్క విషయం మాత్రం స్పష్టం. సాయిరెడ్డి రాజకీయాలకు గుడ్‌బై చెప్పలేదు. ఆయన కేవలం పాత రాజకీయ ఇంటి తలుపు మూసేశారు. ఇప్పుడు కొత్త ఇల్లు కడుతున్నారా.. లేక ఇప్పటికే ఉన్న మరో ఇంటి నీడలో నిలబడుతున్నారా అన్నదే అసలు ప్రశ్న. జగన్‌ను లక్ష్యంగా చేసుకున్న ప్రతి బాణం వెనుక వ్యక్తిగత ఆవేదన ఎంత? రాజకీయ వ్యూహం ఎంత? ఢిల్లీ లెక్క ఎంత? భవిష్యత్ కూటముల అంచనా ఎంత? ఈ నాలుగు లెక్కలు విడదీసి చూస్తేనే సాయిరెడ్డి అడుగుల అసలు దిశ అర్థమవుతుంది. చివరికి రాజకీయాల్లో మాటలు కాదు.. ఎవరి పక్కన నిలబడ్డారు, ఎవరిని వదిలారు, ఎవరిపై బాణాలు సంధించారు అన్నదే వారి రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.



ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో జరుగుతున్న నిరసనలు ఎన్నికల సంఘంపై రాజకీయ పోరాటానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆందోళన వేదికపై కాంగ్రెస్‌లోని పాత బంధాలు, కొత్త సమీకరణాలు, అంతర్గత విభేదాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పంజాబ్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్ ప్రదర్శించిన చురుకుదనం ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. ఇటీవలే పంజాబ్ పీసీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్న వారింగ్, రాహుల్ గాంధీతో కలిసి పోలీసుల నిర్బంధాన్ని ఎదుర్కొంటూ ముందు వరుసలో కనిపించారు. పోలీసుల చుట్టుముట్టిన సమయంలో రాహుల్ గాంధీకి అతి సమీపంలో నిలబడి, తన చేతులను పైకెత్తి నినాదాలు చేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందాయి. వారింగ్ తన ఎక్స్ ఖాతాలో ఈ ఫొటోను ప్రత్యేకంగా పోస్టు చేశారు. ఫొటోలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, వారింగ్ మాత్రమే రంగుల్లో కనిపించేలా మిగతా వ్యక్తులను గ్రేస్కేల్‌లో చూపించడం ద్వారా రాజకీయ సందేశాన్ని మరింత బలంగా చూపించే ప్రయత్నం కనిపించింది. "తుఫానుల్లో కూడా వెలిగే నిప్పురవ్వలమే, అణచివేత ముందు లేచే స్వరమే" అనే భావంతో హిందీ-ఉర్దూ పదాలతో మోత మోగించారు. వారింగ్‌కు ఇది కేవలం నిరసనలో పాల్గొనడం కాదు. కాంగ్రెస్‌లో తన రాజకీయ స్థానం ఇంకా రాహుల్ గాంధీతో తన అనుబంధం బలంగానే ఉందన్న సంకేతంగా కూడా ఈ ప్రదర్శనను రాజకీయ వర్గాలు పరిశీలిస్తున్నాయి. పంజాబ్‌లో పదవి కోల్పోయిన కొద్దిరోజుల్లోనే ఢిల్లీలో గాంధీ కుటుంబానికి అతి దగ్గరగా కనిపించడం ఆయన భవిష్యత్ రాజకీయ వ్యూహంపై ఆసక్తిని పెంచింది.

ఢిల్లీలో పంజాబ్ ఆట!



కాంగ్రెస్‌లో మారిన పంథా

నిరసన వేదికగా నయా హస్తం

రాహుల్‌తో వారియర్ రాజా

పీఠం కోసం కలిసికట్టుగా పోరాటం



పోలీసు బస్సుపైకి ఎక్కిన వారింగ్

మంగళవారం, బుధవారం జరిగిన నిరసనల్లో వారింగ్ నిరంతరం కెమెరాల దృష్టిలో కనిపించారు. సాధారణంగా తెలుపు, బూడిద, ఖాకీ రంగుల దుస్తుల్లో కనిపించిన నాయకుల మధ్య ఆయన ధరించిన ఎరుపు రంగు పాగా ప్రత్యేకంగా కనిపించింది. నిరసనను ప్రత్యక్ష ప్రసారం చేసిన సామాజిక మాధ్యమాల్లో ఆయన దృశ్యాలు పదేపదే ప్రసారం అయ్యాయి. బుధవారం ఢిల్లీలోని షాంగ్రిలా హోటల్ సమీపంలోని రౌండబౌట్ వద్ద పోలీసులు రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకున్నారు. భద్రతా సిబ్బంది ఆయనను భుజాలపై మోసుకుని పోలీసు బస్సులోకి తరలించారు. ఆ సమయంలో వారింగ్, ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ సహా పలువురు నాయకులు పోలీసు బస్సు పైకప్పుపైకి ఎక్కారు. ఈ దృశ్యం నిరసనకు మరింత నాటకీయతను తీసుకొచ్చింది. వారింగ్‌కు ఉదయ్ చిబ్‌తో ప్రత్యేక రాజకీయ అనుబంధం ఉంది. వారింగ్ గతంలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. అందువల్ల యువజన కాంగ్రెస్ నుంచి ఎదిగిన ఇద్దరు నాయకులు ఇప్పుడు రాహుల్ గాంధీ చుట్టూ కనిపించడం కూడా కాంగ్రెస్‌లోని ఒక ప్రత్యేక రాజకీయ బంధాన్ని సూచిస్తోంది. ఇదే సమయంలో వారింగ్ రాజకీయ ప్రత్యర్థిగా భావించే జలంధర్ ఎంపీ, మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ కూడా నిరసనలో పాల్గొన్నారు. అయితే కెమెరాల ముందు వారింగ్ కనిపించిన స్థాయిలో చన్నీ కనిపించలేదు. పంజాబ్ కాంగ్రెస్‌లో ఎవరి ప్రభావం పెరుగుతుంది అన్న ప్రశ్నకు ఢిల్లీ నిరసన ఒక చిన్న రాజకీయ వేదికగా మారింది. ఒకవైపు పదవి కోల్పోయిన వారింగ్ రాహుల్‌తో సన్నిహితంగా కనిపిస్తే, మరోవైపు ఆయన ప్రత్యర్థి వర్గానికి చెందిన చన్నీ కూడా అదే నిరసనలో ఉండటం పంజాబ్ కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత పోటీని బయటపెట్టింది.

• "బాస్‌ను కలవడానికి వెళ్తున్నా" అన్న వారింగ్

అక్టోబర్ 2న పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి వారింగ్ తన రాజీనామాను రాహుల్ గాంధీకి నేరుగా అందించారు. ఢిల్లీలో సమావేశానికి వెళ్లే ముందు "బాస్‌ను కలవడానికి వెళ్తున్నాను" అంటూ ఆయన చేసిన వ్యాఖ్య అప్పట్లోనే రాజకీయ ఆసక్తిని రేకెత్తించింది. రాజీనామా అనంతరం కూడా తనను పదవి నుంచి తప్పుకోవాలని ఎవరూ బలవంతం చేయలేదని వారింగ్ స్పష్టం చేశారు. తనను అధ్యక్షుడిగా నియమించింది రాహుల్ గాంధీయేనని, అందుకే ఆయనకే రాజీనామా ఇచ్చానని వివరించారు. పార్టీ అవసరమైన సమయంలో తాను ఎప్పుడైనా సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రాహుల్ గాంధీ తనపై ఎంతో ప్రేమ చూపించారని కూడా పేర్కొన్నారు. అయితే తన పదవి నుంచి తప్పుకోవడాన్ని మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ విజయంగా అభివర్ణించారు. "చన్నీ సాహిబ్ గెలిచారు" అంటూ వారింగ్ చేసిన వ్యాఖ్య పంజాబ్ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పోరును బహిర్గతం చేసింది. నెలల తరబడి కొనసాగిన విభేదాల తర్వాత ఈ మార్పు జరిగింది. చన్నీతో పాటు సుఖ్‌జిందర్ సింగ్ రంధావా తదితర నేతలు వారింగ్‌ను తొలగించాలని అధిష్టానంపై ఒత్తిడి తెచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. చివరకు జలంధర్ కాంటోన్మెంట్ ఎమ్మెల్యే, మాజీ హాకీ క్రీడాకారుడు పర్గత్ సింగ్‌ను కొత్త పీసీసీ అధ్యక్షుడిగా నియమించారు. పర్గత్ సింగ్ బాధ్యతలు స్వీకరించే ముందు వారింగ్ ఆయనను ఢిల్లీలో కలుసుకుని అభినందించారు. స్థానిక స్థాయిలో పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని పర్గత్ సింగ్ పంజాబ్‌కు వెళ్లారు. మరోవైపు వారింగ్ మాత్రం ఢిల్లీలోనే ఉండి గాంధీ కుటుంబానికి దగ్గరగా కనిపిస్తున్నారు. రాబోయే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో 117 టికెట్ల పంపిణీలో తన వర్గానికి ప్రాధాన్యం దక్కేలా రాజకీయంగా ప్రయత్నిస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. దీంతో పదవి కోల్పోయినా వారింగ్ రాజకీయ ఆట నుంచి బయటకు వెళ్లలేదనే అభిప్రాయం బలపడుతోంది.

• యువజన కాంగ్రెస్ నుంచి ఎదిగిన నేత

వారింగ్ రాజకీయ ప్రయాణం యువజన కాంగ్రెస్‌తో ప్రారంభమైంది. 2000లో ముక్త్‌సర్ బ్లాక్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మొదటి అడుగు వేశారు. 2002లో జిల్లా అధ్యక్షుడయ్యారు. 2008లో పంజాబ్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఎదిగారు. అదే సమయంలో రాహుల్ గాంధీ కూడా కాంగ్రెస్‌లో తన స్వతంత్ర రాజకీయ బృందాన్ని నిర్మించుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. 2012 అసెంబ్లీ ఎన్నికల్లో 34 ఏళ్ల వయసులో గిద్దర్‌బాహా నుంచి కాంగ్రెస్ టికెట్ పొందిన వారింగ్, అప్పట్లో రాహుల్ గాంధీ బృందానికి చెందిన యువ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆ ఎన్నికల్లో పీపుల్స్ పార్టీ ఆఫ్ పంజాబ్ తరఫున పోటీ చేసిన మన్‌ప్రీత్ సింగ్ బాదల్‌ను ఓడించి సంచలనం సృష్టించారు. తరువాత కూడా అదే నియోజకవర్గంలో తన పట్టు కొనసాగించారు. మన్‌ప్రీత్ బాదల్ తరువాత కాంగ్రెస్‌లోకి వచ్చి, ప్రస్తుతం బీజేపీలో ఉన్నారు. అయితే వారింగ్ మాత్రం పార్టీ మారకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగారు. 2014 డిసెంబరులో ఆయనను ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా నియమించారు. దాదాపు నాలుగేళ్లు ఆ బాధ్యతల్లో కొనసాగారు. 2018లో రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడైన తర్వాత కేశవ్ చంద్ర యాదవ్‌ను వారింగ్ స్థానంలో నియమించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ సీనియర్ నేతలను ఎన్నికల బరిలోకి రావాలని ప్రోత్సహించిన సమయంలో వారింగ్ బఠిండా నుంచి పోటీ చేశారు. అయితే శిరోమణి అకాలీదళ్ అభ్యర్థి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2019 ఓటమి తర్వాత రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినప్పుడు, ఆయన తిరిగి పార్టీ అధ్యక్షుడిగా రావాలని వారింగ్ బహిరంగంగా కోరారు. రాజీవ్ గాంధీ 75వ జయంతి కార్యక్రమంలో సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ సమక్షంలో రాహుల్ గాంధీనే పార్టీకి, దేశానికి అవసరమైన నాయకుడని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య ఆయన రాహుల్‌తో ఉన్న దీర్ఘకాల రాజకీయ అనుబంధానికి స్పష్టమైన ఉదాహరణగా నిలిచింది.


• పంజాబ్‌లో పదవి పోయినా పట్టు వీడలేదు

2022లో పంజాబ్ కాంగ్రెస్ పరిస్థితి తీవ్ర సంక్షోభంలో ఉన్న సమయంలో వారింగ్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. కెప్టెన్ అమరీందర్ సింగ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించిన తర్వాత చరణ్‌జిత్ సింగ్ చన్నీ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే 2022 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చవిచూసి ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ సమయంలో పార్టీని తిరిగి బలోపేతం చేసే బాధ్యత వారింగ్‌పై పడింది. ఆయన పంజాబ్ కాంగ్రెస్‌కు అతి పిన్న వయస్కుడైన అధ్యక్షుడిగా గుర్తింపు పొందారు. 2023 జనవరిలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర పంజాబ్‌లోకి ప్రవేశించే ముందు వారింగ్ పాగా ధరించడం ప్రారంభించారు. ఒక మతపరమైన జాతరకు వెళ్లిన సమయంలో పాగా ధరించాలనే నిర్ణయానికి ప్రేరణ లభించిందని ఆయన చెప్పారు. అయితే రాజకీయంగా మాత్రం ఈ మార్పును పంజాబ్‌లో భవిష్యత్ నాయకత్వంపై ఆయన ఆసక్తికి సంకేతంగా కొందరు విశ్లేషించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో లూధియానా నుంచి బీజేపీ అభ్యర్థి రవ్‌నీత్ సింగ్ బిట్టును ఓడించి వారింగ్ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఈ విజయంతో రాష్ట్ర రాజకీయాల్లో తన స్థానం మరింత బలపడిందని ఆయన భావించారు. అదే సమయంలో గిద్దర్‌బాహా అసెంబ్లీ ఉపఎన్నికలో ఆయన భార్య అమృతా వారింగ్ ఓడిపోయారు. అయినప్పటికీ పంజాబ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 13 స్థానాల్లో 7 స్థానాల విజయాన్ని చూపిస్తూ రాష్ట్ర అధ్యక్ష పదవిలో కొనసాగడానికి ఆయన బలం ఉందని వాదించారు. కానీ అంతర్గత విభేదాలు తగ్గలేదు. 2027 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో చన్నీ, ప్రతాప్ సింగ్ బాజ్వా వర్గాలు వారింగ్ నాయకత్వాన్ని ప్రశ్నించాయి. జూలై 1న వారింగ్‌ను కొనసాగిస్తూ, చన్నీకి ఎన్నికల ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించిన అధిష్టాన నిర్ణయం సమస్యను పరిష్కరించలేదు. చివరకు అక్టోబర్ 2న పర్గత్ సింగ్ కొత్త అధ్యక్షుడయ్యారు. ఈ పరిణామం వారింగ్ పదవిని మాత్రమే మార్చింది. కాంగ్రెస్‌లో ఆయన రాజకీయ సంబంధాలను మాత్రం పూర్తిగా మార్చలేకపోయింది.

• నిరసనలో మరో పాత రాహుల్ మిత్రుడు

ఢిల్లీలో జరిగిన నిరసనలో వారింగ్‌తో పాటు రాహుల్ గాంధీకి పాత రాజకీయ అనుబంధం ఉన్న హర్యానా నేత దీపేందర్ సింగ్ హుడా కూడా ముందువరుసలో కనిపించారు. మంగళవారం ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ఇండియా కూటమి చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్న తర్వాత నాయకులు సమీపంలోని ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి వెళ్లారు. అక్కడ చెట్టు కింద కూర్చున్న నాయకుల ఫొటోలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, దీపేందర్ హుడా, చరణ్‌జిత్ సింగ్ చన్నీ కనిపించారు. రాహుల్‌కు సమీపంగా కనిపించడం ద్వారా హుడా కూడా కాంగ్రెస్‌లోని శక్తి కేంద్రానికి తన అనుబంధాన్ని చూపించారు. అయితే సజ్జన్ కుమార్ మరణంపై హుడా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఇటీవల ఆయనపై విమర్శలు వచ్చాయి. ఇప్పుడు పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడైన పర్గత్ సింగ్ కూడా హుడా వ్యాఖ్యలను విమర్శించిన వారిలో ఉన్నారు. హర్యానాలో కూడా భూపిందర్ సింగ్ హుడా, దీపేందర్ హుడా నాయకత్వంపై పార్టీ అంతర్గతంగా ప్రశ్నలు ఉన్నాయి. వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటములు ఆ కుటుంబ నాయకత్వంపై ఒత్తిడిని పెంచాయి. అయినప్పటికీ ఢిల్లీ నిరసనలో దీపేందర్ హుడా గాంధీ కుటుంబానికి సమీపంగా కనిపించడం కాంగ్రెస్‌లోని రాజకీయ సమీకరణాలపై చర్చకు దారితీసింది. ఇదే సమయంలో నిరసనలపై బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పోలీసు సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించారని బీజేపీ నేతలు ఆరోపించారు. రాహుల్ ఒక మహిళా పోలీసును తాకారని, ప్రియాంక మరో మహిళా పోలీసును మోచేతితో నెట్టారని బీజేపీ అధికార ప్రతినిధి సిద్ధార్థ్ యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులపై దాడి చేశారని, పోలీసు వాహనాన్ని ధ్వంసం చేశారని పోలీసులు కేసులు నమోదు చేశారు. ఒక పోలీసు సిబ్బంది తనను 30 నుంచి 35 మంది నిరసనకారులు చుట్టుముట్టి దాడి చేశారని ఫిర్యాదు చేసినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ మాత్రం ఎన్నికల ఓటర్ల జాబితా సవరణపై పారదర్శకత కావాలని, ఎన్నికల సంఘం తీరును ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్య హక్కు కోసం పోరాడుతున్నామని చెబుతోంది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఈ నిరసనలు ఢిల్లీలో ట్రాఫిక్ ఆంక్షలకు దారితీశాయి. తాజా పరిణామాలు చూస్తే ఈ పోరాటం ఎన్నికల సంఘంపై విమర్శలకే పరిమితం కాకుండా కాంగ్రెస్‌లోని నాయకత్వ సంబంధాలు, పంజాబ్‌లో భవిష్యత్ టికెట్ సమీకరణాలు, రాహుల్ గాంధీ చుట్టూ ఉన్న పాత రాజకీయ బృందం ప్రభావం వంటి అంశాలను కూడా వెలుగులోకి తెస్తున్నాయి. వారింగ్‌కు అధ్యక్ష పదవి పోయినా రాహుల్ పక్కన తన స్థానం చూపించగలగడం, హుడా సైతం అదే వేదికపై కనిపించడం కాంగ్రెస్‌లో అధికార కేంద్రానికి దగ్గరగా ఉండటం ఎంత కీలకమో మరోసారి స్పష్టం చేసింది.





దేశ ఆర్థిక వ్యవస్థపై వరుస ఒత్తిళ్లు కనిపిస్తున్నాయి. రూపాయి విలువ పతనం, అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడిచమురు ధరలు, భౌగోళిక ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయాలు భారత మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అక్టోబర్ 8, 2026న భారత స్టాక్ మార్కెట్లు భారీగా కుప్పకూలడం ఈ ఆందోళనలకు మరింత బలం చేకూర్చింది. సెన్సెక్స్ ఒక్కరోజులో 1,045.46 పాయింట్లు కోల్పోయి 71,593.24 వద్ద ముగిసింది. నిఫ్టీ 371.25 పాయింట్లు పడిపోయి 22,231.80 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ స్థాయి 2024 ఫిబ్రవరి 13 తర్వాత అత్యల్ప స్థాయికి చేరింది. నిఫ్టీ కూడా 18 నెలల కనిష్ట స్థాయికి పడిపోయింది. ఒక్కరోజులో బీఎస్ఈ సెన్సెక్స్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ. 10 లక్షల కోట్లు తగ్గిపోయింది. బుధవారం మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 4,70,98,931 కోట్లుగా ఉండగా, గురువారం ముగిసేసరికి అది రూ. 4,60,97,839 కోట్లకు పడిపోయింది. అంటే పెట్టుబడిదారుల సంపదలో భారీగా ఆవిరైన విలువ కేవలం ఒకరోజు మార్కెట్ పతనంతోనే కనిపించింది. అయితే ఇది కంపెనీల ఆస్తులు నిజంగా నష్టపోయినట్లు అర్థం కాదు. షేర్ ధరలు పడిపోవడంతో మార్కెట్ విలువ తగ్గింది. అయినా పెట్టుబడిదారుల విశ్వాసంపై మాత్రం దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. మార్కెట్‌లో ఇప్పటికే ఉన్న ఆందోళనకు రూపాయి పతనం, చమురు ధరల పెరుగుదల మరింత ఆజ్యం పోశాయి. ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య వచ్చిన మార్కెట్ రికవరీ దశ ముగిసిందని కొంతమంది విశ్లేషకులు భావిస్తున్నారు. ఇకపై మరింత అమ్మకాల ఒత్తిడి కనిపించే అవకాశం ఉందన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. ఇది సాధారణ రోజువారీ హెచ్చుతగ్గు కాదని, పలు ఆర్థిక అంశాలు ఒకేసారి మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని నిపుణుల విశ్లేషణ.

డాలర్@100

దేశ ఆర్థిక వ్యవస్థ ఏమైపోతుందో?



96.88 వద్ద రూపాయి ముగింపు

అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అక్టోబర్ 8న రూపాయి 13 పైసలు పడిపోయి 96.88 వద్ద ముగిసింది. అంతకుముందు రోజు 96.75 వద్ద ముగిసిన రూపాయి గురువారం 96.71 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 96.65 వరకు బలపడినా, చివరికి 96.88 వద్ద ముగిసింది. ప్రపంచ మార్కెట్లలో రిస్క్ అవర్షన్ పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు ముదరడం రూపాయిపై ఒత్తిడిని పెంచుతున్నాయి. అమెరికా డాలర్ సూచీ కూడా బలంగా కొనసాగుతోంది. డాలర్ ఇండెక్స్ 102.40 వద్ద ఉండటం మరో ప్రతికూల అంశం. దీనికి తోడు అంతర్జాతీయ ముడిచమురు ధరలు భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 104 డాలర్లకు చేరువైంది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, గల్ఫ్ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై దాడుల భయం, హోర్మూజ్ జలసంధి ద్వారా చమురు సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం వంటి అంశాలు చమురు ధరలను పైకి నెడుతున్నాయి. భారత్ తన చమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతి చేసుకుంటుంది. అందుకే క్రూడ్ ధర పెరిగితే దిగుమతి బిల్లు పెరుగుతుంది. డాలర్లకు డిమాండ్ పెరగడం రూపాయిపై అదనపు ఒత్తిడిని సృష్టిస్తుంది. మరోవైపు విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీల నుంచి భారీగా నిధులు వెనక్కి తీసుకుంటున్నారు. బుధవారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.6,121.37 కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించారు. ఈ పరిస్థితుల్లో రూపాయి మరింత బలహీనపడకుండా రిజర్వ్ బ్యాంక్ జోక్యం చేసుకుంటున్నట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా రూపాయి స్థిరీకరణకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రూపాయి సరైన విలువను కనుగొనేలా క్రమబద్ధమైన కదలిక ఉండేలా చూస్తామని, అధిక అస్థిరతను అడ్డుకుంటామని ఆర్బీఐ హామీ ఇచ్చింది. అయినప్పటికీ డాలర్ బలం, చమురు ధరల పెరుగుదల కొనసాగితే రూపాయిపై ఒత్తిడి తక్షణం తగ్గకపోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రెపో రేటు పెంపు వెనుక అసలు కారణం

ఇదే సమయంలో రిజర్వ్ బ్యాంక్ తీసుకున్న రెపో రేటు పెంపు ప్రధాన ఉద్దేశం వ్యవస్థలో రుణ విస్తరణను కొంత మందగించడం, అధిక డిమాండ్ వల్ల వచ్చే ద్రవ్యోల్బణ ఒత్తిడిని తగ్గించడం. అయితే దీనికి ప్రతికూల వైపు కూడా ఉంది. రుణాలు ఖరీదవుతాయి. వినియోగం తగ్గవచ్చు. ఇళ్ల కొనుగోళ్లు, వాహనాల కొనుగోళ్లు, వ్యాపార విస్తరణపై ప్రభావం పడవచ్చు. అందుకే ఆర్బీఐ నిర్ణయం ద్రవ్యోల్బణ నియంత్రణకు ఒక వైపు ఉపయోగపడినా, ఆర్థిక కార్యకలాపాలపై మరోవైపు ఒత్తిడి పెంచే అవకాశం ఉంది.

కార్లు, ఎంఎస్ఎంఈలపై ప్రభావం

గృహ రుణాల తర్వాత ఆటో రుణాలు, చిన్న వ్యాపార రుణాలపై కూడా ప్రభావం ఉంటుంది. సాధారణంగా ఆటో రుణాలు కూడా ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌తో అనుసంధానమై ఉంటాయి. ఒక రుణంపై రెపో రేటు కంటే 250 బేసిస్ పాయింట్ల స్ప్రెడ్ ఉందనుకుందాం. ఇంతకుముందు రెపో రేటు 5.25 శాతం ఉన్నప్పుడు వడ్డీ 7.75 శాతంగా ఉండొచ్చు. ఇప్పుడు రెపో రేటు 5.50 శాతానికి పెరగడంతో అదే స్ప్రెడ్ కొనసాగితే వడ్డీ 8 శాతానికి చేరుతుంది. ఒక్కసారి 25 బేసిస్ పాయింట్ల పెంపుతో కార్ల కొనుగోలు పూర్తిగా తగ్గిపోదు. కానీ వరుసగా వడ్డీ రేట్లు పెరిగితే వాహనం కొనుగోలు చేసే వ్యక్తి చెల్లించాల్సిన మొత్తం వ్యయం పెరుగుతుంది. దాంతో కొత్త వాహనాల డిమాండ్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. మరో కీలక వర్గం ఎంఎస్ఎంఈలు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల రుణాలు కూడా ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌కు అనుసంధానమై ఉంటాయి. అయితే వాటికి ఉండే స్ప్రెడ్ సాధారణంగా రిటైల్ రుణాల కంటే ఎక్కువగా ఉంటుంది. కారణం వ్యాపార రుణాల్లో రిస్క్ ఎక్కువగా ఉండటం. అందువల్ల రెపో రేటు పెంపుతో వారి రుణ వ్యయం కూడా పెరగనుంది. కొత్తగా రుణం ఎంత స్ప్రెడ్ విధిస్తాయన్నది కీలకం. చిన్న వ్యాపార సంస్థల క్రెడిట్ స్కోర్, గత రుణ చెల్లింపుల రికార్డు ఈ దశలో చాలా ముఖ్యంగా మారుతుంది. మంచి క్రెడిట్ రికార్డు ఉన్న సంస్థలకు తక్కువ స్ప్రెడ్‌తో రుణం లభించే అవకాశం ఉంటుంది. బలహీనమైన రికార్డు ఉన్న సంస్థలకు ఖర్చు మరింత పెరగవచ్చు. రుణ వ్యయం పెరిగితే వ్యాపార విస్తరణ నిర్ణయాలు వాయిదా పడొచ్చు. కొత్త ఉద్యోగాల సృష్టి, పెట్టుబడులు, ఉత్పత్తి సామర్థ్యం పెంపు వంటి అంశాలపై కూడా పరోక్ష ప్రభావం ఉండొచ్చు. అందుకే రెపో రేటు పెంపు కేవలం బ్యాంకులు, రుణగ్రహీతల మధ్య జరిగే వడ్డీ మార్పు కాదు. అది మొత్తం ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపే నిర్ణయం.

ముందున్న దారి.. ఆందోళన ఎందుకు?

ఇప్పుడు అసలు ప్రశ్న దేశ ఆర్థిక వ్యవస్థ ఎటువైపు వెళ్తుందన్నదే. రూపాయి 97కు చేరువలో ఉండటం, చమురు ధరలు 100 డాలర్లకు పైగా ఉండటం, స్టాక్ మార్కెట్ల పతనం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, వడ్డీ రేటు పెంపు ఒకేసారి చోటుచేసుకోవడం మార్కెట్‌కు ప్రతికూల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. దీనికి తోడు ప్రపంచ మార్కెట్లలో కూడా అమ్మకాల ఒత్తిడి కనిపిస్తోంది. అక్టోబర్ 8న జపాన్ నిక్కీ సుమారు 1.13 శాతం పడిపోగా, దక్షిణ కొరియా కోస్పీ 2.26 శాతం తగ్గింది. హాంగ్‌కాంగ్ హాంగ్ సెంగ్ ఈల్డ్స్ పెరగడం, చమురు ధరలు ఎగబాకడం అంతర్జాతీయ పెట్టుబడిదారులను రిస్క్ తీసుకోకుండా వెనక్కి తగ్గేలా చేస్తున్నాయి. దేశీయంగా కూడా జూలై-సెప్టెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభమవుతోంది. కంపెనీల ఆదాయం, డిమాండ్ పరిస్థితి, ఇన్‌పుట్ ఖర్చులు, లాభాల మార్జిన్లపై యాజమాన్యాల వ్యాఖ్యలు మార్కెట్‌కు తదుపరి దిశను నిర్ణయించనున్నాయి. నిఫ్టీ ఇప్పటికే కీలక మద్దతు స్థాయిలను దాటింది. 22,217, 22,182 స్థాయిల కంటే దిగువకు వెళ్లడం అమ్మకాల ఒత్తిడి పెరిగిన సంకేతంగా విశ్లేషకులు చూస్తున్నారు. సమీప కాలంలో 21,700-22,000 ప్రాంతం నిఫ్టీకి కీలక మద్దతు స్థాయిగా భావిస్తున్నారు. మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ అక్టోబర్‌లో రేటు పెంచే అవకాశాలు తగ్గడం, ఆర్బీఐ జోక్యం రూపాయికి కొంత ఊరటనివ్వవచ్చు. అయినా మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు తగ్గకపోతే చమురు ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. అప్పుడు దిగుమతి వ్యయం పెరుగుతుంది. రూపాయిపై ఒత్తిడి కొనసాగుతుంది. ద్రవ్యోల్బణ నియంత్రణ కోసం వడ్డీ రేట్లను ఎక్కువకాలం కఠినంగా ఉంచాల్సిన పరిస్థితి రావచ్చు. అందుకే ప్రస్తుత పరిస్థితిని ఒకే కారణంతో వివరించలేం. రూపాయి పతనం, చమురు ధరలు, ప్రపంచ ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, ఆర్బీఐ విధానం, కంపెనీల భవిష్యత్ ఆదాయాలపై ఉన్న అనిశ్చితి కలిసి మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. రాబోయే రోజుల్లో చమురు ధరలు తగ్గుతాయా? రూపాయి స్థిరపడుతుందా? విదేశీ పెట్టుబడులు తిరిగి వస్తాయా? ఆర్బీఐ మరిన్ని రేట్లు పెంచుతుందా? కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఎలా ఉంటాయి? ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలే భారత

గృహ రుణాలపై ఎక్కువ భారం

రెపో రేటు పెంపు ప్రభావం సామాన్య ప్రజలకు ఎలా ఉంటుంది అన్న ప్రశ్న ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ముఖ్యంగా గృహ రుణాలు తీసుకున్నవారిపై ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌తో అనుసంధానమైన ఫ్లోటింగ్ రేట్ హోమ్ లోన్లపై రీసెట్ సమయంలో వడ్డీ పెరగవచ్చు. ఉదాహరణకు ఒక వ్యక్తి 8.75 శాతం వడ్డీతో రూ.1 కోటి, 20 సంవత్సరాల గృహ రుణం తీసుకున్నాడనుకుందాం. రేటు 25 బేసిస్ పాయింట్లు పెరిగి 9 శాతానికి చేరితే నెలవారీ ఈఎంఐ సుమారు రూ.1,600 వరకు పెరిగే అవకాశం ఉంది. అదే ఈఎంఐ కొనసాగించాలని నిర్ణయిస్తే రుణ కాలం దాదాపు 16 నెలలు పెరిగే అవకాశం ఉంటుంది. భారత్‌లో రిటైల్ రుణాల్లో సుమారు 75 శాతం గృహ రుణాలే కావడం వల్ల ఈ వర్గంపై ప్రభావం పెద్దదిగా ఉండొచ్చు. కొత్తగా ఇల్లు కొనుగోలు చేసేవారికి కూడా సమస్య ఉంటుంది. వడ్డీ పెరిగితే వారి రుణ అర్హత తగ్గుతుంది. ఉదాహరణకు రూ.1 కోటి రుణానికి అర్హత ఉన్న వ్యక్తికి రేటు పెంపు తర్వాత రుణ సామర్థ్యం దాదాపు రూ.97 లక్షలకు తగ్గవచ్చు. అంటే కొనుగోలుదారుడి బడ్జెట్‌పై నేరుగా ప్రభావం పడుతుంది. అయితే ఒక్కసారి 25 బేసిస్ పాయింట్ల పెంపుతోనే గృహాల డిమాండ్ పూర్తిగా కుప్పకూలుతుందని చెప్పలేం. ఇల్లు కొనుగోలు చేసే వ్యక్తులు సాధారణంగా దీర్ఘకాలిక రుణాన్ని తీసుకుంటారు. 10 నుంచి 20 సంవత్సరాల కాలంలో వడ్డీ రేట్లు పలుమార్లు పెరగడం, తగ్గడం సాధారణమే. అయినా వరుసగా రేట్లు పెరిగితే పరిస్థితి భిన్నంగా ఉంటుంది. వడ్డీ భారం పెరగడం, అర్హత తగ్గడం, ఈఎంఐ పెరగడం కలిసి మధ్యతరగతి కుటుంబాల కొనుగోలు శక్తిని ప్రభావితం చేయవచ్చు. ముఖ్యంగా ఇప్పటికే భారీ రుణ భారం ఉన్న కుటుంబాలకు ప్రతి నెలా అదనపు ఈఎంఐ ఆర్థిక ఒత్తిడిని పెంచుతుంది.

రెపో రేటు ఎలా పనిచేస్తుంది?

రెపో రేటు అంటే రిజర్వ్ బ్యాంక్ వాణిజ్య బ్యాంకులకు స్వల్పకాలిక రుణాలు ఇచ్చేటప్పుడు వసూలు చేసే వడ్డీ రేటు. ఈ రేటు పెరిగినప్పుడు బ్యాంకులు తమ వినియోగదారులకు ఇచ్చే రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతాయి. ఫలితంగా ఇల్లు, కార్లు, వ్యక్తిగత రుణాలు, వ్యాపార రుణాలు ఖరీదవుతాయి. ఇది ప్రజల ఖర్చు చేసే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. అదే సమయంలో ఎక్కువ మంది పొదుపు వైపు మొగ్గు చూపుతారు. ఈ మొత్తం ప్రక్రియ ద్వారా మార్కెట్‌లో డబ్బు ప్రవాహం తగ్గి, ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుంది.

ఆర్థిక వృద్ధి, మార్కెట్ పరిస్థితుల పరిశీలన

ఆర్థిక వృద్ధి, మార్కెట్ పరిస్థితులను పరిశీలించి అవసరమైనప్పుడు మరిన్ని రేటు పెంపులు చేయవచ్చనే సంకేతం. అంటే భవిష్యత్తులో మరిన్ని రేటు పెంపులు రావచ్చా? పెంపులు ఎంతకాలం కొనసాగుతాయి? అన్న అనిశ్చితి ఏర్పడింది. ఆర్బీఐ రెపో రేటు పెంచినప్పుడు బ్యాంకులకు రుణాల కోసం నిధుల వ్యయం పెరుగుతుంది. బ్యాంకులు తమ మార్జిన్లను కాపాడుకునేందుకు రుణ వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రెపో రేటుతో అనుసంధానమైన ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్ల... (ఈబీఎల్ఆర్) అంటే బ్యాంకులు రుణాలపై వడ్డీ రేటును నిర్ణయించడానికి బయటి, పారదర్శకమైన ఒక ప్రామాణిక వడ్డీ చమురు ధరలు, రూపాయి విలువ పతనం, అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడిచమురు ధరలు, భౌగోళిక ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయాలు భారత మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అక్టోబర్ 8, 2026న భారత స్టాక్ మార్కెట్లు భారీగా కుప్పకూలడం ఈ ఆందోళనలకు మరింత బలం చేకూర్చింది. సెన్సెక్స్ ఒక్కరోజులో 1,045.46 పాయింట్లు కోల్పోయి 71,593.24 వద్ద ముగిసింది. నిఫ్టీ 371.25 పాయింట్లు పడిపోయి 22,231.80 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ స్థాయి 2024 ఫిబ్రవరి 13 తర్వాత అత్యల్ప స్థాయికి చేరింది. నిఫ్టీ కూడా 18 నెలల కనిష్ట స్థాయికి పడిపోయింది. ఒక్కరోజులో బీఎస్ఈ సెన్సెక్స్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ. 10 లక్షల కోట్లు తగ్గిపోయింది. బుధవారం మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 4,70,98,931 కోట్లుగా ఉండగా, గురువారం ముగిసేసరికి అది రూ. 4,60,97,839 కోట్లకు పడిపోయింది. అంటే పెట్టుబడిదారుల సంపదలో భారీగా ఆవిరైన విలువ కేవలం ఒకరోజు మార్కెట్ పతనంతోనే కనిపించింది. అయితే ఇది కంపెనీల ఆస్తులు నిజంగా నష్టపోయినట్లు అర్థం కాదు. షేర్ ధరలు పడిపోవడంతో మార్కెట్ విలువ తగ్గింది. అయినా పెట్టుబడిదారుల విశ్వాసంపై మాత్రం దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. మార్కెట్‌లో ఇప్పటికే ఉన్న ఆందోళనకు రూపాయి పతనం, చమురు ధరల పెరుగుదల మరింత ఆజ్యం పోశాయి. ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య వచ్చిన మార్కెట్ రికవరీ దశ ముగిసిందని కొంతమంది విశ్లేషకులు భావిస్తున్నారు. ఇకపై మరింత అమ్మకాల ఒత్తిడి కనిపించే అవకాశం ఉందన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. ఇది సాధారణ రోజువారీ హెచ్చుతగ్గు కాదని, పలు ఆర్థిక అంశాలు ఒకేసారి మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని నిపుణుల విశ్లేషణ.

వైభవ్ విధ్వంసం..



కాంచీవేదికగా వెస్టిండీస్‌తో రెండో టీ20కి ముందు భారత జట్టు ప్రాక్టీస్‌లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మరోసారి తన సత్తా చాటాడు. నెట్స్‌లో బంతిని బౌండరీలకు తరలిస్తూ సెలెక్టర్లకు కొత్త సందేశం పంపాడు. పక్కనే స్థానిక హీరో ఇషాన్ కిషన్ కూడా తనదైన దూకుడుతో విరుచుకుపడ్డాడు. రవి బిష్ణోయ్, నమన్ ధీర్, అభిషేక్ శర్మ బౌలింగ్‌ను ఎదుర్కొన్న ఇషాన్ భారీ షాట్లతో ఆకట్టుకున్నాడు. సంజూ శాంసన్ మాత్రం ఆచితూచి బ్యాటింగ్ చేస్తూ క్లాస్ షాట్లతో అలరించాడు. సొంత మైదానంలో ఇషాన్‌పై బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ప్రశంసలు కురిపిస్తూ, గతంతో పోలిస్తే అతడు మరింత పరిణతి సాధించాడని అన్నారు. అయితే అందరి చూపులు మాత్రం వైభవ్‌పైనే నిలిచాయి. ప్రతీ షాట్‌లో దూకుడు.. ప్రతీ బౌండరీలో భవిష్యత్ భారత స్టార్ మెరుపు కనిపించింది. ఇప్పటికే భారత టాప్‌ఆర్డర్‌లో చోటుపై చర్చ మొదలైన ఈ యువ సంచలనం, తనకు అవకాశం వస్తే ఏం చేయగలనో నెట్స్‌లోనే చూపించాడు. తొలి టీ20లో 8 వికెట్ల తేడాతో గెలిచిన భారత్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యం లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.



భువీ రీఎంట్రీ.. షమీపై కోటక్ క్లారిటీ

టీమిండియాలో 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ పునరాగమనం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. 2022 నవంబర్ తర్వాత జాతీయ జట్టుకు దూరమైన భువీ, న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు తిరిగి ఎంపికయ్యాడు. ఆర్‌సీబీ తరఫున 2025, 2026 ఐపీఎల్ టైటిళ్లలో కీలక పాత్ర పోషించి రెండు సీజన్లలో 45 వికెట్లు పడగొట్టడం అతని ఎంపికకు బలమైన కారణమని అసిస్టెంట్ కోచ్ సితాన్షు కోటక్ తెలిపారు. యువ బౌలింగ్ దళానికి అనుభవం అవసరమనే ఉద్దేశంతోనే సెలెక్టర్లు భువీ వైపు చూసి ఉండొచ్చన్నారు. అదే సమయంలో మహ్మద్ షమీకి చోటు దక్కకపోవడంపై ప్రశ్నలు రాగా, తాను సెలెక్టర్‌ను కాదని, షమీ కూడా దేశవాళీ క్రికెట్‌లో బాగా రాణిస్తున్నాడని కోటక్ స్పష్టం చేశారు. జట్టు అవసరం, ఫామ్ ఆధారంగా ఎవరినైనా ఎంపిక చేసే అవకాశం ఉందన్నారు. వీవీఎస్ లక్ష్మణ్ ఎంపిక ప్రక్రియలో పాత్రపై తనకు పూర్తి సమాచారం లేదన్న కోటక్, భారత క్రికెట్ ప్రయోజనాల విషయంలో ఆయన నిబద్ధతను ప్రశంసించారు. వెస్టిండీస్‌పై తొలి టీ20లో ఎనిమిది వికెట్ల విజయంతో భారత్ వరుసగా 10 విజయాలు సాధించగా, యువతకు అవకాశాలు ఇస్తూనే బెంచ్ బలాన్ని పెంచడమే లక్ష్యమని కోటక్ తెలిపారు.

చైనాలో క్రికెట్‌కు ఐసీసీ భారీ ప్లాన్



క్రికెట్ ఇక భారత్, దక్షిణాసియా సరిహద్దులు దాటి చైనాలోనూ వేగంగా విస్తరించే దిశగా ఐసీసీ భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం నేపథ్యంలో చైనా క్రికెట్ సంఘానికి ఐసీసీ మద్దతు ఇవ్వనుంది. త్వరలో టైర్ 2 టోర్నీ నిర్వహణతో పాటు దుబాయ్ ఐసీసీ అకాడమీ తరహాలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడానికి సహకరించనున్నట్లు ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా తెలిపారు. మహిళల క్రికెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన చైనా క్రికెట్ సంఘం, తన కార్యక్రమాల్లో 50 శాతం మహిళల భాగస్వామ్యం లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల 1,500 మంది ప్రేక్షకుల సామర్థ్యంతో క్రికెట్ వేదిక కూడా ప్రారంభమైంది. 2026 పురుషుల, మహిళల టీ20 ప్రపంచకప్‌లను చైనీస్ ప్లాట్‌ఫామ్‌లపై ఐసీసీ ప్రసారం చేయగా, చివరి వారంలో పురుషుల టోర్నీకి 44 లక్షల వీడియో వీక్షణలు వచ్చాయి. గత ఐదేళ్లలో చైనా క్రికెట్ సంఘానికి ఐసీసీ 15 లక్షల డాలర్లకు పైగా నిధులు అందించింది.

యశస్వి కొత్త అవతారం

టీమిండియాలో కొత్త సమీకరణాలు!



భారత క్రికెట్‌లో మరో ఆసక్తికరమైన మార్పుకు యశస్వి జైస్వాల్ తెరతీయనున్నాడా? బ్యాటింగ్‌తో పాటు లెగ్‌స్పిన్‌పై ఇప్పటికే సాధన చేస్తున్న ఈ యువ ఓపెనర్ ఇప్పుడు వికెట్‌కీపింగ్‌పైనా దృష్టి పెట్టాడు. ముంబై కెప్టెన్ సిద్ధేశ్ లాడ్ వెల్లడించిన వివరాలతో ఈ కొత్త ప్రయత్నం చర్చనీయాంశంగా మారింది. 202627 రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో చండీగఢ్‌తో వాంఖడే వేదికగా జరిగే పోరులో యశస్వి ముంబై తరఫున బరిలోకి దిగనున్నాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌లో దాదాపు 10 ఓవర్లు వికెట్ల వెనుక నిలిచినట్లు సమాచారం. బ్యాటింగ్, కీపింగ్, లెగ్‌స్పిన్.. మూడు కోణాల్లో తన ఆటను పదును పెడుతున్న యశస్వి భవిష్యత్‌లో భారత జట్టు కూర్పునే ప్రభావితం చేసే అవకాశం ఉంది. గతంలో రాహుల్ ద్రవిడ్ కూడా బ్యాటర్ నుంచి వికెట్‌కీపర్‌గా మారి వన్డే జట్టులో అదనపు విలువను అందించాడు. యశస్వి ఈ నైపుణ్యాన్ని స్థిరంగా అభివృద్ధి చేస్తే టీమిండియాలో బహుముఖ ఆటగాడిగా కొత్త తలుపులు తెరుచుకునే అవకాశముంది. ముంబై కెప్టెన్ లాడ్ కూడా అతని అనుభవం జట్టుకు, యువ ఆటగాళ్లకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు. అయితే రంజీ తొలి మ్యాచ్ తర్వాత జాతీయ జట్టు బాధ్యతల కారణంగా యశస్వి ముంబైకు అందుబాటులో ఉండడు.

శ్రేయస్ శతకం.. టీమిండియాకు అదిరిపోయే బూస్ట్



లక్నో వేదికగా వెస్టిండీస్‌పై టీమిండియా ఎనిమిది వికెట్ల ఘన విజయం సాధించడంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాట్ మెరుపులు కీలకంగా మారాయి. 35/2తో భారత్ ఒత్తిడిలో ఉన్న వేళ క్రీజులోకి వచ్చిన శ్రేయస్ కేవలం 43 బంతుల్లోనే 102 పరుగులతో అజేయ శతకం బాదాడు. తొలి టీ20 శతకంతో జట్టును ముందుండి నడిపించిన అతడు, 32 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. మాజీ బ్యాటర్ చతేశ్వర్ పుజారా మాట్లాడుతూ ఈ ఇన్నింగ్స్ శ్రేయస్‌కు సరైన సమయంలో వచ్చిందని ప్రశంసించాడు.

నానా పటేకర్..

నటనకు అంతిమ సంతకం

- నానా వెళ్లారు.. నటన మిగిలింది చిరకాలం
- పేదరికం నుంచి పద్మశ్రీ వరకు.. ఓ అసాధారణ ప్రయాణం



వెండితెరపై నటులు చాలామందే ఉంటారు. కానీ పాత్రలోకి పూర్తిగా పరకాయ ప్రవేశం చేసి, తాను కనిపించకుండా పాత్రను మాత్రమే ప్రేక్షకుడి ముందు నిలబెట్టే నటులు చాలా అరుదు. నానా పటేకర్ అలాంటి అరుదైన కళాకారుడు. పేదరికం నుంచి మొదలైన ఆయన జీవితం భారతీయ సినిమా చరిత్రలో చెరిగిపోని అధ్యాయంగా మారింది. సాధారణ కుటుంబంలో జన్మించిన నానా చిన్న వయసులోనే కష్టాలను చూశారు. జీవనం కోసం సినిమా పోస్టర్లు గీసారు. ముంబయి పోలీసులకు నేరస్తుల చిత్రాలు గీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కేవలం రూ.35 కూలీతో జీవితాన్ని ప్రారంభించిన ఆయన తర్వాత దేశం గర్వించే నటుడిగా ఎదిగారు. నాటకరంగం ఆయన నటనా ప్రయాణానికి బలమైన పునాది వేసింది. విజయా మెహతా దర్శకత్వంలోని 'హమీదాబాయి చి కోఠి' నాటకంతో ఆయన ప్రతిభకు గుర్తింపు వచ్చింది. 1978లో 'గమన్' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. మొదట్లో చిన్న పాత్రలే దక్కినా, ఆ పాత్రలను చిన్నవిగా చూడలేదు. ప్రతి పాత్రను తనదైన శైలిలో మలిచారు. 'అంకుష్', 'అంధా యుధ్' వంటి చిత్రాలతో గుర్తింపు పెరిగింది. 'సలాం బాంబే!'తో ఆయన పేరు మరింత విస్తరించింది. 'పరిందా'లో అన్నా పాత్ర నానా నటనా తీవ్రతకు అద్దం పట్టింది. ఆ పాత్రకు జాతీయ ఉత్తమ సహాయ నటుడి పురస్కారం లభించింది. అక్కడి నుంచి నానా పటేకర్ ప్రయాణం మరో స్థాయికి చేరింది. నటుడిగా ఎదిగిన ప్రతి మెట్టులోనూ ఆయన వెనుక ఒక కష్టం ఉంది. ఆ కష్టమే ఆయన నటనలో కనిపించే సహజత్వానికి కారణమైంది. స్టార్‌గా ఎదగడం కంటే నటుడిగా నిలబడటానికే ఆయన ఎక్కువ విలువ ఇచ్చారు. అదే ఆయన జీవిత ప్రయాణానికి అసలు బలం.

ఒక్క మాటతో మంట.. ఒక్క చూపుతో భావోద్వేగం

నానా పటేకర్ నటనలో అత్యంత ప్రత్యేకమైన అంశం ఆయన గొంతు, చూపు, శరీర భాష. ఆయన డైలాగ్ చెప్పినప్పుడు అది కేవలం సంభాషణగా మిగలదు. అది పాత్ర భావోద్వేగంగా మారి నేరుగా ప్రేక్షకుడిని తాకుతుంది. 'క్రాంతివీర్'లో ఆయన పలికించిన ఆవేశభరిత సంభాషణలు ఇప్పటికీ ప్రేక్షకుల జ్ఞాపకాల్లో ఉన్నాయి. ఆ చిత్రంలో ఆయన పోషించిన పాత్రకు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం లభించింది. 'అగ్నిసాక్షి'లో మరో భిన్నమైన పాత్రతో తన పరిధిని చూపించారు. 'పరిందా'లో క్రూరత్వం చూపించిన అదే నటుడు 'ఖామోషి: ది మ్యూజికల్'లో మాటలు లేని తండ్రిగా కళ్లతోనే బాధను వ్యక్తం చేశారు. 'అబ్ తక్ ఛప్పన్'లో కఠినమైన పోలీస్ అధికారిగా కనిపించారు. 'రాజ్‌నీతి'లో ఆలోచనతో మాట్లాడే నాయకుడి పాత్రలో ప్రశాంతత చూపించారు. 'టాక్సీ నంబర్ 9211'లో మరో కోణాన్ని ఆవిష్కరించారు. 'అపహరణ్' వంటి చిత్రాల్లో ఆయన పాత్రలు కథకు ప్రత్యేక బలం ఇచ్చాయి. విలన్‌గా భయపెట్టగలరు. హీరోగా మెప్పించగలరు. పోలీస్ అధికారిగా కఠినంగా కనిపించగలరు. సైనికుడిగా నమ్మకం కలిగించగలరు. సాధారణ మనిషిగా ప్రేక్షకుడి బాధను తన ముఖంలో చూపించగలరు. అదే సమయంలో 'వెల్‌కమ్'లో ఉదయ్ శెట్టి పాత్రతో అద్భుతమైన హాస్యాన్ని పండించారు. తీవ్రమైన పాత్రలు చేసిన నటుడు కామెడీలో కూడా ఇంతగా నవ్వించగలడని ఆ పాత్ర నిరూపించింది. 'నటసమ్రాట్'లో రంగస్థల నటుడి చివరి దశలోని ఒంటరితనం, కుటుంబం నుంచి ఎదురైన నిరాశ, కళాకారుడి అంతర్మథనాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. 'త్రిశాగ్ని', 'తోడాసా రూమానీ హో జాయేన్', 'దీక్ష', 'దిశ', 'అభయ్', 'హూ తు తు' వంటి చిత్రాలు కూడా నానా నటనలోని మరో ప్రపంచాన్ని పరిచయం చేశాయి. నానా నటించిన పాత్ర గుర్తుండేది.. నానా మాత్రం కనిపించేవారు కాదు. పాత్రే ప్రేక్షకుడి ముందుంటుంది. అదే ఆయన అసలు గొప్పతనం.

అవార్డుల కంటే గొప్పది.. నటుడిగా మిగిలిన ముద్ర

నానా పటేకర్ అందుకున్న పురస్కారాలు ఆయన ప్రతిభకు అధికారిక గుర్తింపులు మాత్రమే. మూడు జాతీయ చలనచిత్ర అవార్డులు ఆయన నటనా స్థాయికి ప్రత్యేక ముద్ర వేశాయి. 'పరిందా'కు జాతీయ ఉత్తమ సహాయ నటుడి పురస్కారం, 'క్రాంతివీర్'కు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం, 'అగ్నిసాక్షి'కి మరో జాతీయ గుర్తింపు ఆయన ప్రయాణంలో కీలక ఘట్టాలుగా నిలిచాయి. ఫిల్మ్‌ఫేర్ సహా అనేక పురస్కారాలు ఆయన ఖాతాలో చేరాయి. 2013లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీతో గౌరవించింది. అయితే అవార్డులు వచ్చిన కొద్దీ ఆయన జీవనశైలిలో పెద్ద మార్పు రాలేదు. సినిమా పరిశ్రమలో కనిపించే ఆర్భాటం, స్టార్ హంగామా, ప్రచార ప్రపంచం ఆయనకు పెద్దగా ఆసక్తి కలిగించలేదు. విజయం వచ్చినా సాధారణతను వదలకపోవడం నానా వ్యక్తిత్వంలోని మరో ప్రత్యేకత. నటుడిగానే కాకుండా దర్శకుడిగానూ తన ముద్ర వేశారు. 'ప్రహార్' ఆయన దర్శకత్వ ప్రతిభకు ఉదాహరణ. సైనికుడి పాత్రను నిజంగా అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతో శిక్షణ తీసుకోవడం ఆయన నిబద్ధతను తెలియజేస్తుంది. పాత్ర కోసం తనను తాను మార్చుకోవడం ఆయనకు కొత్త విషయం కాదు. తెరపై ఎంత తీవ్రంగా కనిపించినా, నిజ జీవితంలో సామాజిక సమస్యలపై ఆయనకు ప్రత్యేకమైన స్పందన ఉండేది. మకరంద్ అనస్పురేతో కలిసి 2015లో 'నామ్ ఫౌండేషన్'కు శ్రీకారం చుట్టారు. మహారాష్ట్రలో కరవు, రైతుల సమస్యలు, నీటి కొరత, రైతు కుటుంబాల కష్టాలపై ఆ సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టారు. సినిమాలో సామాన్యుడి బాధను చూపించిన నానా.. నిజ జీవితంలోనూ కష్టాల్లో ఉన్న మనుషుల పక్కన నిలిచారు. అందుకే ఆయన వారసత్వం కేవలం సినిమాలకు పరిమితం కాదు. నటనతో వచ్చిన పేరు, మానవత్వంతో సంపాదించిన గౌరవం కలిసి ఆయన వ్యక్తిత్వాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి.

నానా వెళ్లిపోయారు.. కానీ పాత్రలు ఎప్పటికీ బతికే ఉంటాయి

నానా పటేకర్ మరణం భారతీయ సినిమా ప్రపంచానికి ఒక గొప్ప లోటు. దాదాపు ఐదు దశాబ్దాల నటనా ప్రయాణంలో ఆయన ఎన్నో తరాల ప్రేక్షకులను ప్రభావితం చేశారు. కోపాన్ని చూపించాలన్నా ఆయనదే ప్రత్యేక శైలి. బాధను పలికించాలన్నా ఆయనదే ప్రత్యేక ముద్ర. ప్రేమను వ్యక్తం చేయాలన్నా ఆయనదే సహజత్వం. హాస్యాన్ని పండించాలన్నా ఆయనదే ప్రత్యేకమైన టైమింగ్. గొంతు, చూపు, ముఖ కవళికలు, శరీర భాషతో పాత్రకు ప్రాణం పోయడం ఆయనకు సహజమైన విద్యగా మారింది. నేటి తరం నటులకు నానా పటేకర్ జీవితం ఒక పెద్ద పాఠం. స్టార్‌డమ్ కోసం పరుగెత్తడం కంటే పాత్ర కోసం శ్రమించాలి. సోషల్ మీడియా గుర్తింపు కంటే ప్రేక్షకుడి మనసులో నిలిచే పాత్రను ఎంచుకోవాలి. డైలాగ్‌ను కేవలం పలకడం కాదు.. దాని వెనుక ఉన్న భావాన్ని జీవించాలి. నటుడు ఎంత పెద్దవాడో అతని పారితోషికం నిర్ణయించదు. అతను పోషించిన పాత్రలు ఎంతకాలం ప్రేక్షకుల జ్ఞాపకాల్లో ఉంటాయో అదే అసలు కొలమానం. నానా పటేకర్ ఈ సత్యాన్ని తన కెరీర్‌తో నిరూపించారు. ఆయన నటనలో కోపం ఉంది. కరుణ ఉంది. వ్యంగ్యం ఉంది. నొప్పి ఉంది. తిరుగుబాటు ఉంది. హాస్యం ఉంది. ముఖ్యంగా సామాన్య మనిషి జీవితం ఉంది. అందుకే ఆయనను కేవలం బాలీవుడ్ నటుడిగా చూడటం సరిపోదు. ఆయన రంగస్థల కళాకారుడు. దర్శకుడు. సామాజిక సేవకుడు. పాత్రలను జీవించిన నటుడు. నానా పటేకర్ ఒక తరం నటుడు కాదు.. ఎన్నో తరాలకు నటన నేర్పించే ఒక జీవంతమైన పాఠశాల. అవార్డులు ఆయనకు వచ్చాయి. పాత్రలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. ప్రేక్షకులు ఆయనను గుండెల్లో పెట్టుకున్నారు. ఇప్పుడు నానా భౌతికంగా మన మధ్య లేకపోయినా, 'పరిందా', 'క్రాంతివీర్', 'ప్రహార్', 'అగ్నిసాక్షి', 'ఖామోశి', 'అబ్ తక్ ఛప్పన్', 'వెల్‌కమ్', 'నటసమ్రాట్' వంటి చిత్రాల్లో ఆయన సృష్టించిన పాత్రలు ఎప్పటికీ జీవిస్తూనే ఉంటాయి. నానా పటేకర్ వెళ్లిపోయారు.. కానీ నానా అనే నటనా చరిత్రకు ముగింపు లేదు.

సక్సెస్ మాత్రం అందుకోలేక పోతున్నారు



పాయల్ రాజ్‌పుత్‌కు ఆఫర్లు తగ్గాయా? ఒకే ఒక్క సినిమాతో స్టార్‌గా మారి.. ఇప్పుడు మళ్లీ గట్టిగా ప్రయత్నిస్తున్న ఈ హీరోయిన్ తెలుగు సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు పాయల్ రాజ్‌పుత్. అందం, గ్లామర్‌తో పాటు నటనతోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. కెరీర్ ప్రారంభంలోనే భారీ సక్సెస్‌ను అందుకుంది. అయితే ఆ తర్వాత అదే స్థాయిలో వరుస విజయాలను అందుకోలేకపోయింది. దీంతో ఒకప్పుడు వరుస అవకాశాలతో బిజీగా కనిపించిన పాయల్.. ఇప్పుడు ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటోంది. పాయల్ రాజ్‌పుత్ కెరీర్‌ను 'ఆర్ 100'కు ముందు.. ఆ తర్వాత అని చెప్పుకోవచ్చు. 2018లో అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా సంచలన విజయాన్ని అందుకోవడంతో పాయల్ ఒక్కసారిగా టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో ఆమె పోషించిన ఇందు పాత్ర ప్రేక్షకులపై బలమైన ముద్ర వేసింది. ముఖ్యంగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో పాయల్ చూపించిన నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. పాయల్ కూడా పలుమార్లు 'ఆర్ 100' తన జీవితాన్ని మార్చేసిన సినిమా అని చెప్పుకొచ్చింది. 'ఆర100' తర్వాత పాయల్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే ఆ తర్వాత వచ్చిన సినిమాలు మాత్రం ఆమెకు ఆశించిన స్థాయిలో విజయాలను అందించలేకపోయాయి. 'సీత', 'ఆర్ డీ ఎక్స్ లవ', 'వెంకీ మామ', 'డిస్కో రాజా', 'అనగనగా ఓ అతిథి', 'తీస్ మార్ ఖాన', 'జిన్నా', 'మయా పేటిక', 'రక్షణ' వంటి చిత్రాల్లో నటించినప్పటికీ.. 'ఆర్ ఎక్స్ 100' స్థాయి ఇంపాక్ట్ మాత్రం మరోసారి రాలేదు. ఆర్ 100 తర్వాత పాయల్‌కు మరోసారి బలమైన గుర్తింపు తీసుకొచ్చిన సినిమా 'మంగళవారం'. అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో షైలుగా ఆమె చాలా విభిన్నమైన పాత్రను పోషించింది. ఈ పాత్ర కోసం మానసికంగా, భావోద్వేగంగా చాలా కష్టపడాల్సి వచ్చిందని పాయల్ స్వయంగా చెప్పింది. 'మంగళవారం' తన కెరీర్‌లో మరో ముఖ్యమైన చిత్రంగా నిలిచింది. ఈ సినిమా ద్వారా తాను కేవలం గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాదని పాయల్ నిరూపించుకునే ప్రయత్నం చేసింది. కానీ స్టార్ హీరోయిన్ స్థాయిలో వరుసగా భారీ కమర్షియల్ సినిమాలు, పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం మాత్రం తగ్గింది. దీనిపై గతంలో పాయల్ కూడా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. 'ఆర100'లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేయడం వల్ల ప్రేక్షకులు, దర్శకులు తనను అదే తరహా పాత్రల్లో ఊహించి ఉండొచ్చని ఆమె అభిప్రాయపడింది. తాను అన్ని రకాల పాత్రలు చేయాలనుకుంటున్నానని, ఇంకా తనకు చాలా దూరం వెళ్లాల్సి ఉందని చెప్పింది. రీసెంట్ గా లీడర్ అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.